# తొలివార్త

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com








ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 164 సోమవారం 19 - 10 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial


# హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకలు

- పాల్గొన్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- హైదరాబాద్‌లోని అమరజ్యోతి ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడిన మంత్రి సీతక్క
- రంగురంగుల పూలతో బతుకమ్మను సిద్ధం చేసిన మంత్రి
- తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించిన వేడుకలు
- భారీగా తరలివచ్చిన నగర మహిళలు



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 18 :** నగరంలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో అమరజ్యోతి ప్రాంగణం వద్ద బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆమె ఆధ్వర్యంలో ఇతర మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పూలను అందంగా పేర్చి.. బతుకమ్మను సిద్ధం చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ పండుగను వారంతా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.దీంతో అమరజ్యోతి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ బతుకమ్మ వేడుకలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చారు.తెలంగాణలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక - మిగతా 2 లో

# ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు



- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్
- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 18 :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో - మిగతా 2 లో

### ప్రభుత్వంపై

# కవిత ఫైర్



- ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత
- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 18 :** నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై - మిగతా 2 లో

# హర్మూజ్ జలసంధిలో మునిగిపోయిన సింగపూర్ నౌక

- సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన ఐఫోన్ల కోసం ఎగబడ్డ జనం
- ఐఫోన్లు, పర్ఫ్యూమ్‌లు సేకరిస్తున్నామంటూ వైరల్ అయిన వీడియోలు
- వీడియోలలో చాలా వరకు నకిలీవని తేల్చిన ఫ్యాక్ట్-చెక్ సంస్థలు
- ప్రమాదమా, మైన్ పేలుడా? ఘటన కారణంపై భిన్న కథనాలు



2 లో..

# కోల్‌కతా తొక్కిసలాట ఘటన బాధితులను పరామర్శించిన అమిత్ షా



- ఏడుగురి అరెస్ట్
- కోల్‌కతా దుర్గా పూజ మండపంలో తొక్కిసలాటలో 19 మంది మృతి, 25 మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం సువేందు అధికారి
- నిర్వాహకులు సహా ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశం

**తొలివార్త, కోల్‌కతా, అక్టోబర్ 18 :** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజ ఉత్సవాల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనిన్ దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేడు కోల్‌కతాలో పర్యటించి, బాధితులను పరామర్శించారు. ఈ విషాద ఘటన కారణంగా రాష్ట్రంలో తన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలను అమిత్ షా వాయిదా వేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెంటరాగా, ఆయన నగరంలోని ఒక ప్రైవేట్ నర్సింగ్ హోంలో - మిగతా 2 లో

### ఎన్నికల కమిషన్

# జోక్యం చేసుకోవాలి



- వైసీపీ అధినేత జగన్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠాను కలిసిన జగన్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యాలకు పాల్పడుతోందంటూ ఫిర్యాదు
- నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ
- టీడీపీ కార్యకర్తలకు పోలీసులు సహకరిస్తున్నారని ఫిర్యాదు

**తొలివార్త, అమరావతి, అక్టోబర్ 18 :** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. - మిగతా 2 లో



# భారత్ మాకు ముఖ్య మిత్రదేశం

- రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు
- రష్యా ఇంధన కొనుగోళ్లపై ఆంక్షల నుంచి భారత్‌కు తాత్కాలిక మినహాయింపు
- 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం
- భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని సంకేతాలు

**తొలివార్త, ఢిల్లీ, అక్టోబర్ 18 :** భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన మిత్రదేశమని, ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడటాన్ని ఒక్క రోజులో మార్చుకోవడం కష్టమని - మిగతా 2 లో

# ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు

- ఫ్రాన్స్‌లో హింసాత్మకంగా మారిన జీవన వ్యయ నిరసనలు
- 143 ఏళ్ల నాటి లిమోజెస్ టౌన్ హాల్ భవనాన్ని దగ్ధం చేసిన ఆందోళనకారులు
- దేశవ్యాప్తంగా 1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు
- హింసకు తావులేదంటూ ఖండించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్



2 లో..

# ఏపీలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు

- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి




**తొలివార్త, అమరావతి, అక్టోబర్ 18 :** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో - మిగతా 2 లో

### స్థానిక పోరులో

# వాళ్లే కింగ్ మేకర్లు

- అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న మహిళా ఓటర్లు
- రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తున్న 100 పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు 2.77 శాతం ఎక్కువ ఉన్నారు
- కార్పొరేషన్లలో విశాఖలో అత్యధికంగా 18.37లక్షల మంది ఓటర్లు ఉన్నారు.
- ఏపీలో మహిళా ఓటర్లదే పైచేయి



**తొలివార్త, అమరావతి, అక్టోబర్ 18 :** రాష్ట్రంలోని నగర, పురపాలక ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. ఈ నెల 28న జరగనున్న 100 పట్టణ స్థానిక సంస్థల (మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలు) ఎన్నికల్లో పురుషుల కంటే అతివల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషుల కంటే మహిళలు 2.77 శాతం ఎక్కువగా ఉన్నారు.మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 1,03,44,061 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 50,27,784 మంది ఉండగా, అతివలు 53,14,734 మంది ఉన్నారు. ఇతరులు 1,543 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సమకూర్చిన జాబితాల ఆధారంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఎన్నికల కమిషన్ ఇటీవల ఓటర్ల తుది జాబితాలను వార్డులు, డివిజన్ల వారీగా - మిగతా 2 లో

తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com
సోమవారం 19 - 10 - 2026

# సంపాదకీయం

## ఆహారం విలువ తెలుసుకుందాం!



మనిషికి ఎంత సంపద ఉన్నా, ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా, ఆకలి వేసినప్పుడు అవసరమయ్యేది ఒక్క ముద్ద అన్నమే. అందుకే ఆహారం విలువను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, ఆకలితో బాధపడుతున్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలిని నిర్మూలించడం, పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, ఆహార భద్రతను సాధించడం, ప్రతి ఒక్కరికీ సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందేలా కృషి చేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశాలు.ఒక పూట భోజనం కోసం ఎదురుచూసే కుటుంబాలు, రాత్రి ఆకలితో నిద్రపోయే పిల్లలు, తమను ఆదరించేవారు లేక ఆహారం కోసం ఇతరులపై ఆధారపడే వృద్ధులు కూడా నేటి సమాజంలో ఉన్నారు. ప్లేటులో మిగిలిపోయే అన్నం మరొకరి ఆకలిని తీర్చగలదనే ఆలోచన మనలో ఎంతమందికి వస్తుంది? మనం తినకుండా పారవేసే ఆహారం వెనుక రైతు శ్రమ, భూమి, నీరు, విద్యుత్తు, విత్తనాలు, రవాణా, వంట చేసిన వారి కష్టం దాగి ఉన్నాయి. ఒక అన్నం మెతుకు మన చేతికి చేరే వరకు ఎన్నో దశల్లో ఎంతోమంది శ్రమిస్తారు. కాబట్టి ఆహారాన్ని గౌరవించడం అంటే రైతును గౌరవించడం, ప్రకృతిని గౌరవించడం, మానవ శ్రమకు విలువ ఇవ్వడం.పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించాలి. చిన్నప్పటి నుంచే అన్నం వృథా చేయకూడదని, రైతు కష్టాన్ని గౌరవించాలని, అవసరమైన వారికి సహాయం చేయాలని వాళ్లకు నేర్పాలి. పాఠశాలల్లో ఆహార విలువ, పోషకాహారం, పరిశుభ్రత, ఆహార వృథా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులను గౌరవించాలి. ఆహార ఉత్పత్తికి రైతే ప్రధాన ఆధారం. కడుపు నిండటం మాత్రమే సరిపోదు. సమతుల్యమైన పోషకాహారం కూడా అవసరం. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి తగిన ఆహారం అందేలా శ్రద్ధ చూపాలి. ప్రభుత్వ పథకాలను బలోపేతం చేయాలి. ప్రజాపంపిణీ వ్యవస్థ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ పోషకాహార కార్యక్రమాలు వంటి సేవలు అర్హులైన వారికి సక్రమంగా అందేలా పర్యవేక్షించాలి.ప్రపంచ ఆహార దినోత్సవం ఒక గొప్ప సందేశాన్ని అందిస్తోంది. ఆహారాన్ని గౌరవించాలి, ఆకలిని అర్థం చేసుకోవాలి, వృథాను అరికట్టాలి, అవసరమైన వారికి తోడుగా నిలవాలి. ఇంట్లో ఆహారం ఉన్నప్పుడు పక్కింట్లో ఆకలి ఉందేమో ఆలోచించాలి. వేడుకలలో విందులు జరుగుతున్నప్పుడు రహదారి పక్కన భోజనం కోసం ఎదురుచూస్తున్నవారిని గుర్తుచేసుకోవాలి. ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్క మంచి ఆలోచనను ఆచరణలో పెట్టినా సమాజంలో మార్పు ప్రారంభమవుతుంది.

## హర్మూజ్ జలసంధిలో మునిగిపోయిన సింగపూర్ నౌక

**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో సముద్రంలో తేలియాడుతున్న కంటైనర్ల నుంచి ఐఫోన్లు, ఖరీదైన పర్ఫ్యూమ్‌లను స్థానిక జాలర్లు సేకరిస్తున్నారంటూ కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అక్టోబర్ 14న సింగపూర్ జెండాతో ప్రయాణిస్తున్న 'జీఎఫ్ఎస్ ప్రైడ్' అనే భారీ కంటైనర్ నౌక మునిగిపోయిన నేపథ్యంలో ఈ వీడియోలు వెలుగులోకి వచ్చాయి. అయితే, ఈ వీడియోల వాస్తవికతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.దాదాపు 2,500 కంటే ఎక్కువ కంటైనర్లతో ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ ప్రైడ్ నౌకలో మంటలు చెలరేగి, తీవ్రంగా దెబ్బతిన్న తర్వాత మునిగిపోయిందని సింగపూర్ మారిటైమ్ అండ్ పోర్ట్ అథారిటీ ప్రకటించింది. అయితే, నౌకలోని 21 మంది సిబ్బందినీ సురక్షితంగా కాపాడామని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేసింది.కానీ, 'ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్



కార్ప్స్' (ఐఆర్‌జీసీ) మాత్రం దీనిపై భిన్నమైన కథనాన్ని వినిపిస్తోంది. ఆ నౌక అనధికారిక, ప్రమాదకరమైన మార్గంలోకి ప్రవేశించిందని, సముద్రంలో అమర్చిన మైన్‌ను ఢీకొట్టడం వల్లే పేలుడు సంభవించి మంటలు చెలరేగాయని ఆరోపించింది.ఈ ఘటన తర్వాత ఇరాన్‌కు చెందిన జాలర్లు, స్థానికులు చిన్న పడవల్లో సముద్రంలోకి వెళ్లి, తేలియాడుతున్న కంటైనర్ల నుంచి విలువైన వస్తువులను తీసుకుంటున్నట్లు కొన్ని వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. "ఓ నౌక మునిగిందని తెలిసింది, ఐఫోన్లు, పర్ఫ్యూమ్‌లు దొరుకుతాయని వెళుతున్నాం" అని ఓ వ్యక్తి వీడియోలో చెప్పడం వినిపిస్తోంది. మరో వీడియోలో ఓ చిన్న పడవ ఏకంగా ఒక పెద్ద షిప్పింగ్ కంటైనర్‌ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించడం కనిపించింది.అయితే, ఈ వైరల్ క్లిప్పులపై వాస్తవ పరిశీలన జరిపిన అల్ జజీరా, అన్-నహర్ వంటి ఫ్యాక్ట్-చెక్ సంస్థలు, వీటిలో చాలా వరకు నకిలీవి లేదా ఏఐతో సృష్టించినవని తేల్చాయి. నిజంగానే కంటైనర్లలో ఐఫోన్లు ఉన్నాయా? స్థానికులు వాటిని సేకరించారా? అనే వాటికి స్వతంత్రంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు.ప్రపంచ చమురు, గ్యాస్ వాణిజ్యంలో కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకలపై దాడులు ఇటీవల కాలంలో తీవ్రమయ్యాయి. ఈ ఉద్రిక్తతల మధ్య జీఎఫ్ఎస్ ప్రైడ్ నౌక మునిగిపోవడం గమనార్హం. ప్రమాదమా? లేక దాడి జరిగిందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## కోల్‌కతా తొక్కిసలాట ఘటన బాధితులను పరామర్శించిన అమిత్ షా

**మొదటిపేజీ తరువాయి -** చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి, రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ శరద్‌వత్ ముఖర్జీ కూడా గాయపడిన వారిని పరామర్శించారు.ఈ ఘటనపై కోల్‌కతా పోలీసులు వేగంగా స్పందించారు. తొలుత 14 మందిని అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం పూజా కమిటీ నిర్వాహకులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కూడా ఉన్నారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, హత్యకు సమానం కాని నరహత్య కింద అభియోగాలు నమోదు చేశారు.శనివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కురవడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. అదే సమయంలో మండపంలో తప్పుడు ప్రకటనలు చేయడంతో గందరగోళం చెలరేగి తొక్కిసలాటకు దారితీసిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా సిబ్బంది కొరత, గుంపును అదుపు చేయడంలో వైఫల్యం వంటివి కూడా ఈ దుర్ఘటనకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు కలకత్తా హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.మరోవైపు మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది.

## ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు

**మొదటిపేజీ తరువాయి -** ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా వరకు ధ్వంసమైంది.ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది. ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు. ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు.దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు. "మన గణతంత్రంలో హింసకు తావులేదు" అని ఆయన స్పష్టం చేశారు.ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. "వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు" అని వ్యాఖ్యానించారు. మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమోక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని ఆయన హెచ్చరించారు.

## భారత్ మాకు ముఖ్య మిత్రదేశం

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా తాత్కాలిక ఊరట కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రుబియో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించిన ఆంక్షల చట్టం నుంచి భారత్ సహా కొన్ని దేశాలకు 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్' కింద ఈ వెయివర్‌పై సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే టాప్ 5 దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఉంది. అయితే, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేశారు.శనివారం వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడిన మార్కో రుబియో, ఈ నిర్ణయం వెనుక గల కారణాలను వివరించారు. "ఈ ఆంక్షలు కేవలం రష్యాపైనే కాదు. భారత్ వంటి ఇతర దేశాలపైనా టారిఫ్‌ల రూపంలో ప్రభావం చూపుతాయి. అందుకే అధ్యక్షుడు 60 రోజుల సమయం తీసుకుని, ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని భావిస్తున్నారు" అని తెలిపారు. భారత్ ఇంధన వనరులను వైవిధ్యపరుచుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి ఇంకా గణనీయమైన మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని, ఇది ఒక్కరోజులో మారే ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు.ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించడంతో భారత్ భారీగా దిగుమతులను పెంచుకుంది. ప్రస్తుతం భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, తమ ఇంధన భద్రత కోసం వివిధ దేశాల నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతామని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది.ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్, భారత్ పర్యటనలో ఉన్న రుబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమై, జామ్‌నగర్‌లోని రిఫైనరీని సందర్శించనున్నారు. ఈ 60 రోజుల అధ్యయనం తర్వాత అమెరికా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ మినహాయింపు భారత్‌కు ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రభుత్వంపై కవిత ఫైర్

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు.గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

## స్థానిక పోరులో వాళ్లే కింగ్ మేకర్లు

**మొదటిపేజీ తరువాయి -** ప్రచురించింది.మొత్తం 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గానూ ఏడు మున్సిపాలిటీల్లో ఓటర్ల సంఖ్య లక్ష దాటింది. నంద్యాల, ఆదోని, తెనాలి, గుంతకల్లు, మండపేట, ధర్మవరం, ప్రొద్దుటూరు పట్టణాల్లో లక్షకు పైగా ఓటర్లు ఉన్నారు. వీటిలో 1,99,238 మంది ఓటర్లతో నంద్యాల మున్సిపాలిటీ తొలి స్థానంలో ఉండగా, ఆదోని, తెనాలి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక్కడ కూడా పురుషుల కంటే మహిళలదే పూర్తి ఆధిక్యం.ఎన్నికలు నిర్వహిస్తున్న 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఏడు మున్సిపాలిటీల్లో లక్షకుపైగా ఓటర్లు ఉన్నారు. 1,99,238 మంది ఓటర్లతో నంద్యాల మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆదోని (1.76 లక్షలు), తెనాలి (1.57 లక్షలు) ఉన్నాయి. వీటిలోనూ అతివలదే ఆధిక్యం. నంద్యాలలో మొత్తం 1,99,238 ఓట్లలో పురుషులు 96,672, మహిళలు 1,02,488, ఇతరులు 78 మంది ఉన్నారు. ఆదోనిలో 1,76,676 ఓట్లలో పురుషులు 86,694, మహిళలు 89,946, ఇతరులు 36 మంది ఉన్నారు. తెనాలిలో మొత్తం 1,57,089 ఓట్లలో పురుషులు 75,522, మహిళలు 81,536, ఇతరులు 31 మంది ఉన్నారు. గుంతకల్లు, మండపేట, ధర్మవరం, ప్రొద్దుటూరులోనూ లక్షకుపైగా ఓటర్లు ఉన్నారు.కార్పొరేషన్లలోనూ నారీమణులదే జోరు : రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థల్లో (కార్పొరేషన్లలో) ఎన్నికలు జరుగుతుండగా, తొలి ఆరు స్థానాల్లో ఉన్న బడా కార్పొరేషన్లలో మహిళలే అధికంగా ఉన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో అత్యధికంగా 18,37,901 మంది ఓటర్లు ఉండగా, రెండో స్థానంలో విజయవాడ, ఆ తర్వాతి స్థానాల్లో గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి ఉన్నాయి. ఈ ఆరు నగరాల్లో ఎక్కడ చూసినా పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లే వేల సంఖ్యలో అధికంగా ఉండటం విశేషం.

## ఏపీలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు

**మొదటిపేజీ తరువాయి -** ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి.ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

## ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి



**మొదటిపేజీ తరువాయి -** ఆదివారం ఆయన ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనివ్వకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు భౌతికంగా అడ్డుకుంటున్నారని జగన్ ఆరోపించారు. కొన్నిచోట్ల రిటర్నింగ్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ పత్రాలు స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ గూండాలకు పోలీసులే పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని జగన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.నేటితో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రిటర్నింగ్ అధికారులు, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జగన్ ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

## ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు

**మొదటిపేజీ తరువాయి -** ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌స్ట్రీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు



నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకలు



**మొదటిపేజీ తరువాయి -** ప్రాధాన్యం ఉన్న సంగతి తెలిసిందే. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలు సమూహాలుగా ఏర్పడి పాటలు పాడుతూ ఈ పండుగను జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. మహిళల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందించడంలోనూ ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుంది.

## పుంగనూరుకు రావొద్దు: పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డిలకు పోలీసుల నోటీసులు

**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అట్టుడుకుతున్న పుంగనూరు**

**ఎంపీ మిథున్ రెడ్డిపై నాలుగు కేసులు నమోదు**

**పుంగనూరులోకి ప్రవేశించవద్దని పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డిలకు నోటీసులు**



పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించవద్దని పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ పరిణామంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన పెద్దిరెడ్డి, పుంగనూరు ఎన్నికల బరి నుంచి వైసీపీ వైదొలుగుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు.నామినేషన్ల తొలిరోజు టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసాత్మక ఘటనల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ఈ ఘర్షణలకు సంబంధించి ఎంపీ మిథున్ రెడ్డిపై నాలుగు కేసులు నమోదు చేశారు. మరో 250 మందికి పైగా వైసీపీ నేతలపై కూడా కేసులు నమోదయ్యాయి.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
తెలుగు దిన పత్రిక
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



## ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు

# నూతన హ్యాండ్ బోర్ ప్రారంభించిన

**ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన నూతన హ్యాండ్ బోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం, ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నూతన హ్యాండ్ బోర్‌ను ప్రారంభించడం ద్వారా స్థానిక ప్రజలకు, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు నీటి సదుపాయం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఈ ఏర్పాటు ఉపయోగకరంగా ఉండనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు వంటి ప్రాథమిక సదుపాయాలను కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు అవసరమైన వసతులు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళాలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ మందిరంలో

# క్షత్రియ మహిళలు కుంకుమ అర్చన

**ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) కార్యదర్శి డీకే రాజేష్**



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, అక్టోబర్ 18 ( తొలివార్త ):** ఆర్మూర్ పట్టణంలో శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ మందిరంలో కుంకుమ అర్చన నిర్వహించారు. శ్రీదత్తాత్రేయ లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ మహిళా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమ అర్చన కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాత ను పూజించి ఆలయం లో మహిళలు పూలతో ఆలయంలోని దుర్గామాతను పూజించి మహిళలతో కలిసి వివిధ మహిళలు. ఈ సందర్భంగా మహిళా గ్రూప్ సభ్యులు ఖాందేశ్ సంగీత, గటడి స్వాతి మాట్లాడుతూ క్షత్రియ మహిళా గ్రూప్ సభ్యులు ఏర్పాటు సంతోషాన్నిచ్చిందన్నారు. ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది), డీకే రాజేష్ , కార్యవర్గ సభ్యులు పాల్గొని సహకారం అందించారన్నారు. క్షత్రియ మహిళా గ్రూప్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ మహిళలు డిజె సులోచన, బారడ్ రమాదేవి, సాత్ పుతే మంజుల, అల్జాపూర్ చంద్రకళ, గుజరాతి లక్ష్మి, గటడి జయశ్రీ, గటడి శిరీష ,పడాల్ పద్మ, గీత, వాణి, రజిని, రంజిత, రేవతి, సుధా, సౌమ్య, మమత, సునీత, వనిత, సంతని, మధుమతి, సునంద తదితరులు పాల్గొన్నారు.

## బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్

## కమిటీ వైస్ చైర్మన్‌గా కాక రాములు నియామకం



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన పాలకవర్గంలో అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామానికి చెందిన కాక రాములు వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కమిటీ చైర్మన్‌గా తోలెం కల్యాణి నియమితులయ్యారు. నూతన పాలకవర్గానికి రెండేళ్ల పదవీకాలం ఉండనుంది. అలాగే మార్కెట్ యార్డులో తాగునీరు, పారిశుద్ధ్యం, పంట ధాన్యం నిల్వ సదుపాయాలు, రైతులకు విశ్రాంతి వసతి వంటి సౌకర్యాలను మెరుగుపరిస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, మార్కెట్‌కు సంబంధించిన సేవలు అర్హులైన రైతులకు అందేలా అవగాహన కల్పించడం కూడా పాలకవర్గం ముందున్న ముఖ్యమైన బాధ్యత, రైతులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలు

**వనస్థలిపురం అక్టోబర్ 18 ( తొలివార్త ):** 18.10.2026 మధ్యాహ్నం సుమారు 01:30 గంటల సమయంలో దసరా పండుగ సందర్భంగా తల్లపల్లి వంశీ తన భార్య వాణి, ఇద్దరు చిన్నారులైన మన్విష్, యుగ్విష్‌లతో కలిసి టి టి.ఎస్. 08ఈ.హెచ్2661 నంబర్ గల ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వెళ్తూ ఆటోనగర్, డీర్ పార్క్ ఎదురుగా చేరుకున్నారు. అదే సమయంలో ఏపీ10ఎ.ఎల్ 9116 నంబర్ గల కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడిపి వెనుక నుంచి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వంశీకి ఎడమ తొడ ఎముక విరగడంతో పాటు చేతులు, ముఖంపై రక్తగాయాలు అయ్యాయి. అతని భార్య వాణికి ఎడమ పక్కటెముకల భాగంలో మరియు ఇతర శరీర భాగాల్లో గాయాలయ్యాయి. వారి కుమారుడు మన్విష్ కుడి కంటికి రక్తగాయం కాగా, మరో కుమారుడు యుగ్విష్ తల, ముక్కు భాగాల్లో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని శ్రేయాస్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఎల్.బి. నగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారులో డ్రైవర్ కట్ల నితిన్ గౌడ్ తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు ఫిర్యాదుదారుడు తెలిపాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.

## చదరంగం జాతీయ స్థాయి పాఠశాల క్రీడలకు

## ఎంపికైన చిద్విలాసినికి ప్రజా సంఘాల అభినందనలు

**చిద్విలాసిని భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా**

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**




**హైదరాబాద్ అక్టోబర్ 18 ( తొలివార్త ):** చదరంగం క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పాఠశాల క్రీడలకు ఎంపికైన కుమ్మరి కుంట్ల చిద్విలాసినిని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అభినందించారు. చిన్న వయసులోనే చదరంగం క్రీడలో ప్రతిభను చాటుకొని జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. చిద్విలాసిని తన ప్రతిభ,పట్టుదల,కృషితో జాతీయ స్థాయిలోనూ అద్భుత విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి,తన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,క్రీడారంగంలో మరింత రాణించి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని జాజుల లింగంగౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్లావత్ సైదా నాయక్ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు లావూరి రవీందర్ నాయక్ నక్క నాగరాజు కుమ్మరి కుంట్ల సుధాకర్ ఆలంపల్లి సైదులు చరణ్ తేజ కార్తీక్ శశాంక్ రాంబాబు యాదవ్ మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరు చైర్మన్ పదవికి ఇండిపెండెంట్ గా నామినేషన్ వేసిన ఆర్. వసంతకుమారి

**పట్టణంలో 26 వేల మంది హిందువులు 9000 కుటుంబాలున్నా**

**రాజకీయంగా ఎదగలేకపోయాం అవకాశం ఇవ్వండి అభివృద్ధే లక్ష్యం**



**నందికొట్కూరు, అక్టోబర్ 18 ( తొలివార్త ):** నందికొట్కూరు మున్సిపాలిటీ చైర్మన్ పదవికి శ్రీ వైష్ణవీ విద్యా సంస్థల అధినేత రావింద్రబాబు ఆర్. వసంతకుమారి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నందికొట్కూరు పట్టణంలో హిందువుగా, తొగట వీర క్షత్రియురాలిగా పోటీ చేయడానికి మీ ముందుకు వచ్చినానని ఆమె తెలిపారు. నందికొట్కూరు పట్టణంలో హిందువులు సుమారుగా 26 వేల మందికి పైగా జనాభా కలిగి ఉన్నారని, అందులో తొగట వీర క్షత్రియుల కుటుంబాలు 9000 కు పైగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఇంతమంది జనాభా ఉన్నా ఇన్ని రోజులు రాజకీయంగా ఎదగలేకపోయామని, ఇప్పుడు వచ్చిన ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ ఆశీర్వదించి తనను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**చైర్మన్ అయితే చేసే అభివృద్ధి ఇదే**

తాను చైర్మన్ గా గెలిచిన అనంతరం నందికొట్కూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ముఖ్యంగా పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతి వార్డులో కొత్త పైప్ లైన్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడతానని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మిస్తానని వీధి దీపాలు పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా అమలు చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం విద్యా, వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తానని, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు, స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆలయాల అభివృద్ధి, మార్కెట్ యార్డు, బస్ స్టాండ్ ఆధునీకరణ, పార్కుల అభివృద్ధి వంటి పనులు చేపట్టి నందికొట్కూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఆమె తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, కుల మతాలకు అతీతంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

# నేలపట్లలో ఘనంగా 5కే రన్,వాక్

**జెండా ఊపి ప్రారంభించిన డీఎస్పీ మధుసూదన్ రెడ్డి**






**చౌటుప్పల్, అక్టోబర్ 18 ( తొలివార్త ):** దసరా పండుగను పురస్కరించుకొని నేలపట్ల గ్రామంలో ఆర్గనైజర్ దబ్బటి రాములు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ మరియు వాక్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఉదయం 6-00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి విచ్చేసి జెండా ఊపి పరుగును ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో డీఎస్పీ మాట్లాడుతూ.. పరుగు పందెం,నడకలో పాల్గొన్న క్రీడాకారులు, గ్రామస్తులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు."ఆరోగ్యమే మహాభాగ్యం.నిత్య జీవితంలో వ్యాయామం అలవర్చుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలి" అని ఆకాంక్షించారు. గతంలో కూడా ఇలాంటి ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించిన దబ్బటి రాములు గౌడ్ ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే సహకరించిన భూమ్ రెడ్డి గారిని కూడా అభినందించారు. భవిష్యత్తులో గ్రామ యువతను,ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ మరిన్ని క్రీడా,సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పరుగు,నడక పోటీల్లో పాల్గొన్న దాదాపు 150 మందికి జ్ఞాపికగా మెడల్స్ అందజేశారు. అనంతరం క్రీడాకారులకు,అతిథులకు దబ్బటి రాములు గౌడ్ సొంత ఖర్చులతో చక్కటి భోజన వసతి కల్పించారు. చేసిన ఏర్పాట్లను చూసి గ్రామస్తులు,అతిథులు రాములు గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి,శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి,4వ వార్డు కౌన్సిలర్ ఉదరి యాదయ్య,పిఏసిఎస్ డైరెక్టర్ రావుల స్వామి,పందుల లింగస్వామి,బేతడం లింగస్వామి,ప్రకాష్మాజీ సర్పంచ్ లు కప్పల శ్రీనివాస్,చౌట వేణు గోపాల్,వంగాల బిక్షపతి,మాజీ ఉప సర్పంచ్ బట్టి శ్రీనివాస్,వార్డు మెంబర్లు బూడిద లింగస్వామి,కత్తుల సాయి కుమార్,గంజి లింగేశ్,చౌట శివ గౌడ్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలరాజు,మందొల్లగూడెం గ్రామ ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి,స్థానిక వాకర్స్ దప్పు స్వామి,జిన్న సంతోష్ రెడ్డి,చిన్నం నర్సింహ,మదన్, కిరణ్,వెంకటేష్, సంజీవ,సైదులు,భాస్కర్,బుట్టి సత్యం,చంద్రశేఖర్, దబ్బటి బాలరాజు,చిన్నం శివ శంకర్,భాను,తేజ, అరుణ్,ప్రవీణ్, మహేష్,సత్యం, వినోద్,జగత్ మరియు ప్రజాప్రతినిధులు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వందన సమర్పణ అడ్వకేట్ నాగరాజు చేశారు.

# కాంగ్రెస్ కు పాలన చేతకాదు.. చేతులెత్తేసింది!

**మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ధ్వజం**

**మీకు చేతకాకపోతే మాకు అప్పగించండి.. కరెంట్, నీళ్లు ఎలా ఇవ్వాలో చూపిస్తాం - జగదీష్ రెడ్డి సవాల్**




**సూర్యాపేట అక్టోబర్ 18 ( తొలివార్త ):** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, విద్యుత్ సంక్షోభంపై ఘాటుగా స్పందించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావట్లేదని, ఏం చేయాలో దిక్కుతోచక చేతులెత్తేస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు పాలన పట్టించుకోకుండా కేవలం స్కాములు, వాటాల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు.

**కరువుకు కారణం ఎల్నినో కాదు.. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే:**

రాష్ట్రంలో కరువు పరిస్థితి స్పష్టంగా కనబడుతోందని, మన తెలంగాణ నీళ్లతోనే ఆంధ్ర లబ్ధి పొందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కృష్ణాలో మనం 18 టీఎంసీల నీళ్లు కూడా వాడలేదంటే ఈ ప్రభుత్వ అసమర్థత అర్థమవుతుందన్నారు. కన్నెపల్లి పంపు హౌస్ ఒక్కటి ఆన్ చేస్తే ప్రతీ చెరువు మత్తడి దునికేది, తెలంగాణ ప్రాజెక్టులన్నీ నిండుకుండలా ఉండేవని అన్నారు. గోదావరి నుండి 250 టీఎంసీలు ఎత్తుకునే వాళ్లమని, కేసీఆర్ హయాంలో తెలంగాణకు కరువు అనేదే లేకుండేనని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేదని, కేవలం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కరువు దాపురించిందని అన్నారు.

**మళ్లీ కేసీఆర్ రావాల్సిందే:**

ఎల్నినో వస్తదని ఏడాది ముందు నుంచే నిపుణులు చెబుతున్నా, తెలిసి కూడా ఈ ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రెప్పపాటు కరెంట్ పోని రాష్ట్రంగా రికార్డు సృష్టించామని, నేడు కరెంట్, నీళ్ల కోసం జనం అల్లాడుతున్నారని అన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని, ప్రైవేట్ బొగ్గు కమిషన్లకు ఆశపడి సింగరేణిని బదనాం చేస్తున్నారని, ఉద్యోగులను బలిచేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. "పదే పదే చెబుతున్నాం.. ఈ కరువుకు ఎల్నినో కారణం కాదు, ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. మీకు చేతకాకపోతే మాకు అప్పగించండి.. విద్యుత్, నీళ్లు ఎలా ఇవ్వొచ్చో చూపిస్తాం. మన రాష్ట్ర వనరులను దోచి పరాయి రాష్ట్రాన్ని బాగు చేసేందుకే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది. దీన్ని ఉద్యోగులు, అన్ని రంగాల ప్రజలు గమనిస్తున్నారు. మళ్లీ కేసీఆర్ రాగానే అన్నింటినీ ఎలా పునరుద్ధరించాలో మాకు తెలుసు" అని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

# బాదావత్ రవిచంద్ర హత్యపై కేసు దర్యాప్తు ముమ్మరం చేయాలి

**ప్రభుత్వం అన్ని విధాల వారి కుటుంబాని ఆదుకోవాలి**

**లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** నిందితులను కఠినంగా శిక్షించాలి, తక్షణమే కేసు దర్యాప్తు ముమ్మరం చేయించాలి.ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలిఅని కోరుతూ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన లంబాడి హక్కుల పోరాట సమితి బృందం. మహిళా అధ్యక్షురాలు సుజాత భాయ్. రాందాస్ నాయక్.మంజుల భాయ్. అర్జున్ నాయక్. సాగర్ నాయక్.. రవి చంద్ర తల్లి విజయ్ బాయ్, గత కొద్ది రోజుల క్రితం జరిగిన ఘటన విషయం తెలిసిందే :- పినపాక నియోజకవర్గంలోని కరకగూడెం మండలం, కలువల నాగారం గ్రామం,ఏజెన్సీ ప్రాంతంలో స్థిర నివాసం ఉంటున్న అమాయక గిరిజన యువకుడైన బాదావాత్ రవిచంద్ర 27 తండ్రి దసరు(లేట్) ను తేది.11-10-2026న రాత్రి గం.9-45 ని.లకు అతి దారుణంగా కిరాతకంగా హత్య చేసిన 1) మహమ్మద్ ఇమ్రాన్ పై హత్య కేసు నమోదు (ఇప్పటికే రిమాండ్ చేసియున్నారు) మరియు హత్యకు సహకరించిన అనుమానితులు 2) (ఇమ్రాన్ తండ్రి), 3) (ఇమ్రాన్ బావమరిది), 4) (ఇమ్రాన్ బావమరిది) లపై హత్యా నేరం-ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు-ఆర్థిక లావాదేవీల హత్య- అమాయక ట్రైబ్ ను నమ్మించి హత్య చేయడం మొదలైన నేరాల కింద, పైన పేర్కొన్న గిరిజనేతరులపై హత్యా నేరం కేసు నమోదు చేసి, చట్టపరమైన కఠిన శిక్షలు విధించి, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల ప్రాణాలకు రక్షణ కల్పించి, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన అన్ని సెక్షన్ ల ప్రకారం కఠిన చర్యలు తీసుకొని - రవిచంద్ర మృతి కేసు ఎఫ్ ఐ ఆర్ నెంబర్.112/2026, కరకగూడెం పోలీస్ స్టేషన్) - నిష్పక్షపాత, సమగ్ర దర్యాప్తు జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం కల్పించవలసిందిగా మరియు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు,తీసుకోవాలని,ఆదేశించగలరని,లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్టి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కొఆర్డినేటర్ రాజేష్ నాయక్ విన్నపము.పై విషయానుసారము, పై అంశాలపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపించి, హత్య జరిగిన రోజు ది.11-10-2026న మృతుడు బదావత్ రవి చంద్ర మరియు నిందితుడు మహమ్మద్ ఇమ్రాన్ ల యొక్క ఫోన్ కాల్ రికార్డ్ డేటా, వారు ఎవరెవరికి ఫోన్ చేసినారో వారి కాల్ రికార్డ్స్, (సీసీటీవీ కెమెరాలు ఉంటె వాటి ఫుటేజీలు), హత్య సంఘటన జరిగిన స్థలంలో ఆ సమయంలో సెల్ ఫోన్ టవర్ సిగ్నల్ ఆధారంగా అక్కడ ఉన్న అన్ని ఫోన్ ల జిపిఎస్, లొకేషన్ ఫోన్ నెంబర్లు వివవరాలు నిందితుల సెల్ ఫోన్స్ ఎక్కడెక్కడ వున్నది పూర్తిగా ట్రాక్ చేయాలి. మహమ్మద్ ఇమ్రాన్ ఎవరెవరిని కలిశారో వారి వివరాలు సేకరించి పరిశీలించాలి. మృతుడు షెడ్యూల్డ్ తెగకు చెందినవారని ఎస్సీ ఎస్టీ యాక్ట్, కింద వర్తించే నిబంధనలు మరియు సంబంధిత సెక్షన్ లను అమలు చేయాలి. మృతుడి తల్లి బాదావత్ విజయ (వయస్సు: 42 సం.) భర్త.దసరు (లేట్) కి ఏకైక దిక్కైనటువంటి కొడుకు బదావత్ రవిచంద్ర హత్య గావించబడినందున ఆమె అనాథ అయిపోయింది. రవిచంద్ర తల్లి పోషణ బాగోగులు చూసుకోవడానికి కూడా ఎవరూ లేరు. కావున, ఆమె దీన స్థితిని కడుపుకోతను, మనో వేదనను పరిగణలోనికి తీసుకుని, ప్రభుత్వం రవిచంద్ర కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుని ప్రభుత్వం నుండి తగిన పరిహారం అందించి ఆమెకు న్యాయం చేయాలని, హత్య చేసిన నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# ఎమ్మెల్యే పాయం చేతులు మీదుగా ఘనంగా బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** ఆళ్లపల్లి మండలంలోని ఆళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే,ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బతుకమ్మ విగ్రహావిష్కరణ ఘనంగా కార్యక్రమం చేపట్టారు. అనంతరం బతుకమ్మ కి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాల ప్రాధాన్యతను ఆయన,వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందని తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ గొప్ప సంప్రదాయాన్ని కాపాడుకుంటూ, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత,అని,అన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల పట్ల యువతలో అవగాహనను పెంచుతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ, మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని, పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి గ్రామంలో బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని పేర్కొంటూ, గ్రామ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com

# బతుకమ్మ... ఎక్కడ పోయాయమ్మా ఆ రోజులన్నీ!

**అక్టోబర్ 18 ( తొలివార్త ):** బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు... ఆడబిడ్డల ఆత్మీయత, అమ్మల అనురాగం, పల్లె ప్రజల ఐక్యత, మన తెలంగాణ సంస్కృతికి ప్రతీక. బతుకమ్మ అంటే నాకు ఒక పండుగ మాత్రమే కాదు... నా చిన్ననాటి జ్ఞాపకాలతో అల్లుకున్న ఓ అందమైన ప్రపంచం! ఆ రోజులు గుర్తొస్తే మనసు ఇప్పటికీ పల్లెబాట పడుతుంది... కళ్ళముందు బాల్యం కదలాడుతుంది... గుండెల్లో తెలియని ఆనందం, ఏదో కోల్పోయాననే బాధ రెండూ కలుగుతాయి.



**దసరా సెలవులొస్తే... మా ఊరంతా సందడే!**

నేను చిన్నతనంలో ఉన్నప్పుడు దసరా సెలవులు వస్తున్నాయంటే చాలు... మా ఊరిలో పండుగ వాతావరణం మొదలయ్యేది. పొద్దున్నే నిద్రలేచింది మొదలు సాయంత్రం చీకటి పడే వరకు ఇంటి కడప తొక్కకుండా స్నేహితులతో కలిసి ఊరంతా తిరిగేవాళ్లం. ఒకవైపు నాన్న, మరోవైపు అమ్మ, ఇంకోవైపు నానమ్మ... మా కోసం వెతుక్కుంటూ గల్లీలు, సందులు తిరిగేవాళ్లు. "శివా... ఎక్కడున్నావురా? ఇంటికి రారా!" అంటూ వాళ్లు పిలుస్తుంటే, మేమేమో ఆ పిలుపులు వినిపించినా విననట్టే ఆడుకుంటూ ఉండేవాళ్లం. మా ఊరిలోని ప్రతి గల్లీ మాకు పరిచయమే. ప్రతి సందులోనూ ఓ స్నేహితుడు ఉండేవాడు. పొలాలు, చెరువులు, బావులు, ఊరి పెద్ద స్కూలు... ఇవన్నీ మా ఆటస్థలాలే! సాయంత్రమైతే వాలీబాల్, క్రికెట్ అంటూ మరో ప్రపంచంలోకి వెళ్లిపోయేవాళ్లం. ఇంటికి రావాలనే ఆలోచనే ఉండేది కాదు. అమ్మానాన్నలు తిట్టినా, బతిమాలినా, మళ్లీ ఆటలో పడిపోవడమే! అప్పుడు మా దగ్గర పెద్దగా డబ్బులు ఉండేవి కావు. ఇప్పటిలా చేతిలో సెల్‌ఫోన్లు లేవు. ఇంటర్నెట్ లేదు. వీడియో గేమ్‌లు లేవు. కానీ మా జీవితాల్లో ఆనందానికి మాత్రం కొదవ ఉండేది కాదు. ఇప్పుడు వందల రూపాయలు ఖర్చు పెట్టినా దొరకని ఆనందం... అప్పుడు చిల్లిగవ్వ ఖర్చు లేకుండానే దొరికేది! ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే సందడి! ఇక ఎంగిలిపూల బతుకమ్మ వచ్చిందంటే మా ఆనందానికి హద్దులుండేవి కావు. పొద్దున్నే తెల్లవారకముందే, సుమారు ఐదు గంటలకే లేచి, చేతిలో సంచి పట్టుకుని, దోస్తులందరినీ వెంటబెట్టుకుని పూల వేటకు బయలుదేరేవాళ్లం. ఊరి శివార్లలోకి, గుట్టల దగ్గరికి, పొలాల గట్ల మీదికి వెళ్లి రకరకాల పూలు తెంపుకొచ్చేవాళ్లం. తంగేడు పూలు, గునుగు పూలు, బంతిపూలు... ప్రకృతి ఒడిలో పూసిన ప్రతి పువ్వూ మాకు ఓ సంపదలాగే కనిపించేది. ఆ పూలన్నీ తెచ్చి అమ్మ చేతిలో పెట్టేవాళ్లం. అమ్మ వాటిని చూసి మురిసిపోయేది. ఒక్కో పువ్వునూ ఎంతో ప్రేమగా సర్దుతూ బతుకమ్మను పేర్చేది. ఆమె చేతుల్లో పూలు అందమైన బతుకమ్మగా రూపుదిద్దుకుంటుంటే, మేము మాత్రం చుట్టూ తిరుగుతూ... "అమ్మా... ఇంకా ఎంతసేపు? బతుకమ్మ ఎప్పుడు పూర్తవుతుంది?" అంటూ ఒకటే తొందరపెట్టేవాళ్లం. అమ్మ నవ్వుతూ, "ఆగురా బిడ్డా... అందంగా తయారు చేయాలి కదా!" అనేది. అలా పూలను పేర్చి, మధ్యలో గౌరమ్మను నిలిపి, బతుకమ్మను అందంగా అలంకరించేది. ఆ బతుకమ్మలో అమ్మ చేతి అందమే కాదు... ఆమె ప్రేమ, ఓపిక, భక్తి కూడా కనిపించేవి. సద్దుల బతుకమ్మ... ఊరంతా ఒక్కచోట చేరిన వేళ! రోజులు గడిచేకొద్దీ బతుకమ్మ సందడి పెరిగేది. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబరం, రోజురోజుకూ కొత్త కళను సంతరించుకుని సద్దుల బతుకమ్మ నాటికి ఊరంతా పండుగ శోభతో వెలిగిపోయేది. ఆడవాళ్లంతా కొత్త బట్టలు కట్టుకుని, చేతులకు గాజులు వేసుకుని, తలల్లో పూలు పెట్టుకుని, రంగురంగుల బతుకమ్మలను చేతబట్టి బయటకు వచ్చేవాళ్లు. ఒక్కో ఇంటి నుంచి ఒక్కో బతుకమ్మ... చివరికి ఊరంతా ఒకే చోట చేరిన పూలవనంలా కనిపించేది. ఆడపడుచుల గొంతుల్లో బతుకమ్మ పాటలు మారుమోగేవి. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో..." ఆ పాటల్లో ఎంతటి మాధుర్యం ఉండేదో! ఆ మాటల్లో ఎంతటి ఆప్యాయత ఉండేదో! పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడే ఆడపడుచులను చూస్తుంటే, ప్రకృతి కూడా వాళ్లతో కలిసి నాట్యం చేస్తున్నట్టుగా అనిపించేది. సాయంత్రం కాగానే ఊరంతా కలిసి చెరువు దగ్గర ఉన్న బండవైపు బయలుదేరేవాళ్లం. బతుకమ్మలను చేతబట్టి వెళ్తున్న ఆడవాళ్లు, వాళ్ల వెంట నడుస్తున్న పిల్లలు, చుట్టూ వినిపించే పాటలు, నవ్వులు... ఆ దృశ్యాన్ని చూస్తే ఇప్పటికీ మనసు పులకించిపోతుంది. అక్కడికి వెళ్లాక బతుకమ్మలను చుట్టూ పెట్టి పాటలు పాడేవాళ్లు. ఆటలాడేవాళ్లు. ఒకరినొకరు పలకరించుకునేవాళ్లు. అది కేవలం పండుగ కాదు... ఊరంతా ఒక కుటుంబంలా కలిసిపోయే సందర్భం.

**బాంబుల కోసం అమ్మానాన్నల వెంటపడిన బాల్యం!**

ఇక మా పిల్లల సంగతి చెప్పాలా! బతుకమ్మ వచ్చిందంటే మాకు పూల సంతోషం ఎంత ఉండేదో, బాంబులు కాల్చాలనే సరదా కూడా అంతే ఉండేది. "అమ్మా... బాంబులు కొనిపెట్టు!" "నాన్నా... నాకు కూడా కావాలి!" అంటూ అమ్మానాన్నల వెంటపడేవాళ్లం. వాళ్ల దగ్గర డబ్బులు ఉన్నా లేకపోయినా, మా చిన్నచిన్న కోరికల కోసం వాళ్లను విసిగించేవాళ్లం. ఆ వయసులో కుటుంబ పరిస్థితులు ఏంటో, డబ్బు విలువ ఏంటో మాకు తెలియదు కదా! మా ప్రపంచంలాలా చిన్నది. ఆ ప్రపంచంలో అమ్మానాన్నలు, స్నేహితులు, ఆటలు, పండుగలు, బతుకమ్మ, బాంబులు... ఇవే మహాసంపదలు! బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, బాంబులు కాలుస్తూ, స్నేహితులతో నవ్వుకుంటూ గడిపిన ఆ సాయంత్రాలు ఇప్పటికీ నా కళ్లముందు కదలాడుతుంటాయి. అమ్మ బతుకమ్మను చూసుకుంటుంటే, మేమేమో మా ఆనందంలో మునిగిపోయేవాళ్లం. ఆ సమయంలో మాకు తెలియదు... ఈ చిన్నచిన్న క్షణాలే రేపు జీవితంలో చెరిగిపోని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని! కాలం మారింది... మనుషులూ మారారు! కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! చూస్తుండగానే బాల్యం దాటిపోయింది. చదువులు, బాధ్యతలు, ఉద్యోగాలు, కుటుంబాలు... జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ఊరంతా తిరిగిన మా స్నేహితుల్లో ఎవరు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. ఒకప్పుడు మమ్మల్ని వెతుక్కుంటూ గల్లీల్లో తిరిగిన అమ్మానాన్నల వెంట ఇప్పుడు మేము నడవలేని దూరాలకు వెళ్లిపోయాం. ఆ రోజుల్లో మమ్మల్ని ఇంటికి రమ్మని పిలిచిన అమ్మ గొంతు ఇప్పుడు ఎక్కడో జ్ఞాపకాల లోతుల్లో వినిపిస్తున్నట్టుగా ఉంటుంది. ఒకప్పుడు తెల్లవారుజామున పూల కోసం పరుగులు తీసిన ఆ కాళ్లు ఇప్పుడు జీవితపు బాధ్యతలతో అలసిపోయాయి. ఒకప్పుడు బతుకమ్మ పాటలతో మారుమోగిన ఆ సందులు, సాయంత్రం ఆటలతో సందడి చేసిన ఆ వీధులు... ఇప్పుడు చూస్తుంటే ఏదో తెలియని వెలితి కనిపిస్తుంది. కాలం మనకు ఎన్నో ఇచ్చింది. సౌకర్యాలు ఇచ్చింది. సాంకేతికతను ఇచ్చింది. ప్రపంచాన్ని మన చేతుల్లో పెట్టింది. కానీ అదే కాలం మన బాల్యంలోని ఆ స్వచ్ఛమైన ఆనందాన్ని, ఆ పల్లె అనుబంధాలను, ఆ మనుషుల మధ్య ఉన్న ఆప్యాయతను ఎక్కడో వెనక్కి వదిలేసిందేమో అనిపిస్తుంది. ఇప్పుడు ఆ రోజులన్నీ ఎటు పోయాయమ్మా? ఈ రోజు బతుకమ్మ పండుగ వస్తే మళ్లీ ఆ పాత జ్ఞాపకాలన్నీ మనసులోకి వస్తాయి. పూలు కనిపిస్తే అమ్మ గుర్తొస్తుంది. బతుకమ్మ పాట వినిపిస్తే మా ఊరు గుర్తొస్తుంది. చెరువు కనిపిస్తే ఆ సాయంత్రాలు గుర్తొస్తాయి. పిల్లలు ఆడుకుంటుంటే మా బాల్యం గుర్తొస్తుంది. అప్పుడు మనసు తెలియకుండానే ఒక ప్రశ్న అడుగుతుంది... "ఎటు పోయాయమ్మా ఆ రోజులన్నీ?" ఆ గల్లీలు ఎక్కడికి పోలేదు. ఆ చెరువు అక్కడే ఉంది. ఆ పొలాలు కూడా అక్కడే ఉన్నాయి. మన ఊరు కూడా అక్కడే ఉంది. కానీ ఆ రోజుల్లో మనతో కలిసి నవ్విన మనుషులు, మనతో పాటు తిరిగిన స్నేహితులు, మనల్ని వెతుక్కుంటూ వచ్చిన అమ్మానాన్నలు... ఆ క్షణాలు మాత్రం తిరిగి రావు. మనం పెరిగిపోయాం. మన కోరికలు మారిపోయాయి. మన జీవితాలు మారిపోయాయి. కానీ మనసులోని ఆ చిన్నపిల్లవాడు మాత్రం ఇప్పటికీ బతుకమ్మ కోసం పూలు తెంపుకోవడానికి తెల్లవారుజామున లేవాలని కోరుకుంటున్నాడు. అమ్మ చేతిలో పూల సంచి పెట్టి, ఆమె చుట్టూ తిరుగుతూ, "అమ్మా... బతుకమ్మ అయిపోయిందా?" అని అడగాలని అనుకుంటున్నాడు. స్నేహితులందరినీ మళ్లీ ఒకచోట చేర్చి, ఆ పాత సందుల్లో పరుగులు తీయాలని ఆశపడుతున్నాడు. కానీ అది సాధ్యమా? జీవితం మనకు నేర్పిన గొప్ప పాఠం ఒక్కటే... కొన్ని ఆనందాలను మనం జీవిస్తున్నప్పుడు వాటి విలువను గుర్తించలేం. అవి జ్ఞాపకాలుగా మారిన తర్వాతే వాటి విలువ ఎంత గొప్పదో తెలుస్తుంది! బతుకమ్మ అంటే నాకు... బతుకమ్మ అంటే నాకు పూలతో పేర్చిన ఓ అందమైన పండుగ మాత్రమే కాదు. అది నా అమ్మ చేతి స్పర్శ. అది నా నాన్న ప్రేమ. అది నా నానమ్మ ఆప్యాయత. అది నా స్నేహితుల నవ్వులు. అది మా ఊరి గల్లీలు. అది తెల్లవారుజామున పూల కోసం చేసిన పరుగులు. అది సాయంత్రం చెరువు దగ్గర వినిపించిన బతుకమ్మ పాటలు. అది బాంబులు కొనివ్వమని అమ్మానాన్నల వెంటపడిన అమాయకత్వం. అది తిరిగి రాని నా బాల్యం! ప్రతి సంవత్సరం బతుకమ్మ వస్తుంది. పూలు పూస్తాయి. ఆడపడుచులు బతుకమ్మలను పేర్చి పాటలు పాడతారు. కానీ నా మనసు మాత్రం ప్రతిసారీ ఒక్కసారి మా చిన్ననాటి మునిపంపుల గ్రామానికి వెళ్లివస్తుంది. ఆ పాత గల్లీల్లో తిరుగుతుంది. ఆ స్నేహితులను వెతుకుతుంది. అమ్మ చేతిలోని పూలను చూస్తుంది. చెరువు దగ్గర ఆగి పాత పాటలను గుర్తుచేసుకుంటుంది. ఎందుకంటే... మనిషి ఎక్కడికి వెళ్లినా, ఎంత ఎదిగినా, తన బాల్యాన్ని మాత్రం గుండెల్లో మోస్తూనే ఉంటాడు. బతుకమ్మ పండుగ వచ్చిన ప్రతిసారీ నాకు అనిపించేది ఒక్కటే... "అమ్మా... ఇంకొక్కసారి ఆ పాత రోజులను చూడాలని ఉంది. ఇంకొక్కసారి నీ చేతులతో పేర్చిన బతుకమ్మ చుట్టూ తిరగాలని ఉంది. ఇంకొక్కసారి నా స్నేహితులతో కలిసి ఆ పాత గల్లీల్లో పరుగులు తీయాలని ఉంది. ఇంకొక్కసారి ఆ బాల్యాన్ని జీవించాలని ఉంది!" కానీ కాలం వెనక్కి తిరగదు. జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ చెరిగిపోవు. అందుకే ఈ బతుకమ్మ పండుగ సందర్భంగా నా మనసులో నుంచి వస్తున్న ఒక చిన్న మాట... బతుకమ్మా... నువ్వు ప్రతి సంవత్సరం రావాలి. మా తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో ఆనందాలు నింపాలి. మా పల్లెల్లో పాత అనుబంధాలను మళ్లీ చిగురింపజేయాలి. మన సంస్కృతిని భావితరాలకు అందించాలి. ఎందుకంటే బతుకమ్మ పూల పండుగ మాత్రమే కాదు... మన మూలాలను గుర్తుచేసే జ్ఞాపకాల పండుగ కూడా! బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...బంగారు బతుకమ్మ ఉయ్యాలో...మా బాల్యపు జ్ఞాపకాలను మళ్లీ తీసుకురావమ్మా...

**మా పల్లె సందడిని మళ్లీ చూపించవమ్మా...!**

**జై తెలంగాణ... జై బతుకమ్మ!**

# నాణ్యత పేరుతో అందరికీ విద్యను దూరం చేయకండి రాష్ట్ర అధ్యక్షులు చావా రవి.

**ఖమ్మం అక్టోబర్ 18 ( తొలివార్త ):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి మాట్లాడుతూ విద్యా హక్కు చట్ట ప్రకారం పాఠశాలలు అందుబాటులో ఉండాలి అందరికీ నాణ్యమైన విద్యను అందించాలి కానీ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తామని పేరుతో ప్రభుత్వ పాఠశాలను అందుబాటులో లేకుండా చేయడం సమంజసం కాదని నాణ్యత పేరుతో అందరికీ విద్యను దూరం చేయవద్దని కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్న నిబంధనలను పట్టించుకోకుండా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలలను కుదించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాఠశాలలో అవసరమైన ప్రాంతాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని ఆ పేరుతో ఉన్న పాఠశాలను మూసివేస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు మరణ శాసనంగా మారిన జీవో నెంబర్ 25 ను సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయ నియమించాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులపై




యూపుల భారాన్ని తొలగించాలని బోధనేతర పనుల బారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలకు మండలాలకు విద్యాధికారుల పోస్టుల మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు. సర్వీస్ నిబంధనల సమస్యలను పరిష్కరించి ఉన్నత స్థాయి పోస్టుల పదోన్నతులకు మార్గం శుభం చేయాలని సూచించారు. తక్షణమే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 1.7.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్సి అమలుపై నిర్ణయం తీసుకోని పక్షంలో నవంబర్లో మరోసారి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని హాస్పిటల్లో హెల్త్ కార్డుల పై దాగదురాహిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. హెల్త్ కార్డ్ జారీలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి అర్హులైన వారందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని కోరారు. జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం మర్చిపోయిందని తాత్కాలికంగా ఉపసంహానంగా ఇచ్చిన జీవో నెంబర్ 190 అమలు చేయడం లేదని విమర్శించారు. సిపిఎస్ ను రద్దు చేయాలని మెనో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీని ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని మోడల్ స్కూల్ ను ప్రభుత్వం పూర్తిగా తమ ఆధ్వర్యంలోకి తీసుకొని 010 పద్దు కింద ఉపాధ్యాయులందరికీ వేతనాలు అందించాలని 317 జీవోను మోడల్ స్కూల్లో అమలు చేసి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని గిరిజన సంక్షేమ పాఠశాలలో పండిట్ పీఈటి పోస్టులు అప్లోడ్ చేయాలని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని గురుకులాలకు మాదిరిగా మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల టైం టేబుల్ సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల పదోన్నతులు షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి రాజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళి ఎం వెంకటేశ్వర్లు ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ షమీం కోశాధికారి వల్లనకొండ రాంబాబు కార్యదర్శులు డి నాగేశ్వరరావు పి సురేష్ షేక్ ఉద్దీన్ షరీఫ్ యాకుబ్ పాషా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# సర్ రద్దు.. జ్ఞానేష్ కుమార్ వద్దు ఓటు చోరీపై ఈ నెల 23న దేశవ్యాప్త మహా ఉద్యమం

**వ్యవసాయ కార్మిక సంఘం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్**

**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** భద్రాచలం, పట్టణ కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, మైనార్టీ, దళిత, గిరిజన వర్గాల ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలకు కారణమైన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న దేశవ్యాప్తంగా మహా ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ప్రకటించారు. ఆదివారం భద్రాచలంలోని స్థానిక చంద్రరావు భవనంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**మైనార్టీ, దళిత, గిరిజన ఓట్లే లక్ష్యంగా తొలగింపులు**

'సర్ రద్దు.. జ్ఞానేష్ కుమార్ వద్దు' అనే నినాదం దేశవ్యాప్తంగా మారుమోగుతోందని బి. వెంకట్ అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆయన ఆరోపించారు. తొలగించిన ఓట్లలో మైనార్టీ, దళిత, గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఓట్లు అధికంగా ఉన్నాయని విమర్శించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర విమర్శలు...**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని బి. వెంకట్




ఆరోపించారు. భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై జ్ఞానేష్ కుమార్, మోదీ, అమిత్ షాల పాత్రపై సుప్రీంకోర్టు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు చేసిన రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల నిర్వహణపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

**ప్రజాతంత్ర శక్తులతో ఐక్య ఉద్యమం.....!**

దేశంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం సీపీఎం దేశవ్యాప్త ఆందోళనకు కార్యాచరణ రూపొందించిందని బి. వెంకట్ తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ వేదికగా మేధావులు, ప్రజాతంత్ర శక్తులు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులతో ఐక్య వేదికను ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జంతర్‌మంతర్ వేదికగా సాగిన పోరాటాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసి వచ్చే బీజేపీ వ్యతిరేక శక్తులను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఎల్ నేనో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు తాండవం చేస్తుంటే దేశ సంపదను అదాని అంబానీలకు మోడీ సర్కార్ కట్టబెడుతుందని అన్నారు. రాష్ట్రంలోనూ సైతం బిజెపి విధానాన్ని కొనసాగుతుందని వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులు పూట గడవని పరిస్థితి నెలకొంటున్న ప్రభుత్వం చోద్యం చూస్తుందని వెంకట్ ఆరోపించారు. సాగులూరు లేక రైతులు పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాజకీయ ప్రసంగాలకే ప్రజాప్రతినిధులు పరిమితం కావడం సరైనది కాదని అన్నారు. పౌరుడి హక్కు అయినా ఓటు కోసం ఓ పక్క ఉద్యమాలు నిర్వహిస్తూనే మరోపక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలను ఏకకాలంలో నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్‌బాబు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు డి. సీతాలక్ష్మి బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అదృశ్యం అయిన బాలుడు

**గంటలో ఆచూకీ కనిపెట్టిన వనస్థలిపురం పోలీస్ సిబ్బంది**



**వనస్థలిపురం అక్టోబర్ 18 ( తొలివార్త ):** గణేష్ టెంపుల్, వనస్థలిపురం నందు ఒక బాలుడు జయంష్ రెడ్డి, నాలుగు సంవత్సరాలు మిస్ అయిన సమాచారం బాలుడి తల్లి లావణ్య ద్వారా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ కి రాగా, వెంటనే పోలీస్ స్టేషన్ స్టాఫ్ వెంకటేష్, సుధాకర్ మరియు ఉమన్ స్టాఫ్ ప్రేమలత బాలుడి గురించి వెతకగా, బాలుడుని గంటలోపు గుర్తించి, తల్లికి సురక్షితంగా అప్పగించడం జరిగింది.

# ఇరప రామయ్య దశదిన కర్మలకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన

**ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** అశ్వాపురం మండల పరిధిలోని చింతిర్యాలగూడెం గ్రామంలో ఇరప రామయ్య దశదిన కర్మల కార్యక్రమానికి పినపాక నియోజకవర్గం, ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరప రామయ్య చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామయ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, నాయకులు లంకమల్ల కొండలరావు, తెల్లం వీరభద్రం, చింతిర్యాల, సర్పంచ్ ఏనిక ఉషారాణి, మాజీ ఎంపిటిసి ఎనీక రవిబాబు వేముల విజయ్, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు, బట్ట సత్యనారాయణ, కాక రాములు, మరియు పోడియం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ పూట విషాదం

**నీట మునిగి యువకుని మృతి..**




**నూతనకల్, అక్టోబర్ 18 ( తొలివార్త ):** ప్రమాదవశాత్తు యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గుండ్ల సింగారం కత్వలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూర్ (ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లి గ్రామానికి చెందిన ఇరుగు వినయ్, మహారాష్ట్రకు చెందిన సుభాన్జి ,జనగామ కు చెందిన కడారి భాను ప్రకాష్ లు హైదరాబాదులో స్నేహితులు. పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చిన వీరు గుండ్ల సింగారం వద్దగల కత్వాలోకి ఈతకు వెళ్లారు. కడారి భాను ప్రకాష్ కు ఈత రాక నీటి మునిగాడు. నీట మునిగిన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొన్నారు. ఎస్సై నాగరాజు స్వయంగా తన సిబ్బందితో నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే నీటిలో మునిగిన భాను ప్రకాష్ (23) మృతి చెందాడు. మృతుని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

# దుర్గమ్మ దయ ప్రజలందరిపై ఉండాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.**



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 18 ( తొలివార్త ): ప్రతి నిధి** ఈరోజు సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ శ్రీనివాస్ నగర్ కాలనీ శ్రీ మాత నల్ల పోచమ్మ తల్లి దేవాలయం (శివశక్తి పీఠం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకల్లో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఈరోజు దుర్గామాత గా భక్తులను అనుగ్రహించగా, ఈ నవరాత్రి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి దయ భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, బొర్రా చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు ఖాదరయ్య, సాంబశివ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సేవే సంతోషం... చిరునవ్వే నిజమైన బహుమతి".




**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 18 ( తొలివార్త ): ప్రతి నిధి.** కేపీ. వివేకానంద్ కి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గిఫ్ట్ ఏ స్మైల్ ప్రోగ్రామ్ ద్వారా దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేసిన అభిమాని."గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమం ద్వారా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అభిమాని, వెన్నెల గడ్డకు చెందిన ఎస్.శివ ముదిరాజ్, ఎస్. గోపీ కృష్ణ ముదిరాజ్ ఈనెల 21వ తేదీన ఎమ్మెల్యే పుట్టిన రోజు ను పురస్కరించుకొని గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేతుల మీదుగా బాచుపల్లికి చెందిన దివ్యాంగుడు రాజుకు వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సేవ, మానవత్వం, ఆప్యాయతలే నిజమైన వేడుకలకు అర్థమని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడమే లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా ఎంతో మంది జీవితాల్లో సంతోషాలు నింపామని నా పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగుడు రాజుకు వీల్ చైర్ ను అందించిన శివా ముదిరాజ్, గోపీ క్రిష్ణ కు నా అభినందనలు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బెంగాలీ ఆనందో ఉత్సవ

# సంఘం 11వ వార్షిక దుర్గా పూజలు

**బిఎన్‌వీవీఎస్ ప్రభాకర్, విజయ్ వాజ్‌పేయి, ముత్యం రెడ్డిలకు ఘన సన్మానం**



**నాచారం, అక్టోబర్ 18 ( తొలివార్త ):** బెంగాలీ ఆనందో ఉత్సవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ వార్షిక దుర్గా పూజ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్ ప్రభాకర్, విజయ్ వాజ్‌పేయి, ముత్యం రెడ్డిలను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దుర్గా పూజ వేడుకలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి పండుగలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు వివిధ వర్గాల ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు.సంఘం చైర్‌పర్సన్ అసిత్ కుమార్ ముఖర్జీ, అధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుకుమార్ మండల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేడుకల్లో సంఘం సభ్యులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని దుర్గామాత ఆశీస్సులు పొందారు.

## త్రిశూల్ ధర్మశక్తి ఆధ్వర్యంలో 27వ వార్షిక నవరాత్రి వేడుకలు

**బిభక్తులకు అన్నప్రసాద వితరణ**



**నాచారం, అక్టోబర్ 18 ( తొలివార్త ):** నాచారం సర్కిల్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో త్రిశూల్ ధర్మశక్తి ఆధ్వర్యంలో 27వ వార్షిక నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు లోకేష్, అమర్నాథ్ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గాయత్రి ముంత, వెంకట్ కృష్ణ అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, కార్తీక్, భవిష్, హర్ష, సాయి, చందు, నితీష్, భాస్కర్, విశాల్, అరుణ్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా సేవలకు అరుదైన గౌరవం

**బిరూప్‌కుమారి చౌదరి చేతుల మీదుగా సన్మానం అందుకున్న బోదాసు మాధవి**



**నాచారం, అక్టోబర్ 18 ( తొలివార్త ):** ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా అంగన్ మిలన్ కార్యక్రమానికి అందించిన సేవలకు గుర్తింపుగా బోదాసు మాధవి సన్మానం అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ ఎంపీ రూప్‌కుమారి చౌదరి చేతుల మీదుగా ఈ గౌరవాన్ని అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా బోదాసు మాధవి మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి సన్మానించిన రూప్‌కుమారి చౌదరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన కృషిని గుర్తించి ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చిన శిల్పారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచి సహకరించిన బీజేపీ కార్యకర్తలకు, ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారం, ప్రోత్సాహంతోనే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజాసేవకు అంకితమై, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని బోదాసు మాధవి తెలిపారు.

## అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నాణ్ స్పా సెంటర్‌పై వనస్థలిపురం పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**కేసు నమోదు చేసిన పోలీసులు**




**వనస్థలిపురం అక్టోబర్ 18 ( తొలివార్త ):** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాణ్ స్పా సెంటర్‌పై తేదీ 18.10.2026న వనస్థలిపురం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సదరు స్పా సెంటర్ ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా, ఎటువంటి అర్హతలు లేని సిబ్బందిని అక్కడ పనిచేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో స్పా సెంటర్ నిర్వాహకుడు మహబూబ్ స్వామి, తో పాటు, అర్హతలు లేకుండా అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రజలు ఎవరైనా స్పా సెంటర్లు లేదా ఇతర సంస్థలను నిర్వహించేటప్పుడు సంబంధిత అనుమతులు పొందడంతో పాటు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వనస్థలిపురం పోలీసులు సూచిస్తున్నారు.

## శాలిగౌరారం మండల కేంద్రంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**ఆటపాటలతో మార్మోగిన రాములవారి ఆలయ పరిసరాలు**



**శాలిగౌరారం, అక్టోబర్ 18 ( తొలివార్త ):** శాలిగౌరారం మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా, కన్నుల పండుగ గా నిర్వహించారు. మండల కేంద్రంలోని శాలిగౌరారం ప్రాజెక్టు దగ్గర రాములవారి ఆలయం వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాటలు, కోలాటాలు, మహిళల సందడితో డిజె బతుకమ్మ పాటలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మహిళలు ఉత్సవాల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. సద్దుల బతుకమ్మతో గ్రామంలో పండుగ శోభ నెలకొంది. ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి.

## దసరా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలి జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్

**ప్రజల భద్రతకు పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ**

**శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు**




**సూర్యాపేట అక్టోబర్ 18 ( తొలివార్త ):** సూర్యాపేట జిల్లా ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బెట్టింగ్ లు, జూదం, గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, పండుగలను సంప్రదాయబద్ధంగా, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. దసరా సెలవుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇంటి భద్రత కోసం సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండుగ కోసం స్వగ్రామాలకు వచ్చే యువత గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ఎలాంటి గొడవలకు తావివ్వకూడదని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రమాదకర ప్రాంతాల్లో ఆడుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

**అత్యవసర సమయంలో సంప్రదించండి:**

డయల్ - 112 సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్: 8712686026, 8712686057 లేదా సమీప పోలీస్ స్టేషన్ ను సంప్రదించండి.

# వినాయక్ నగర్‌లో అక్రమార్కుల అరాచకం

**టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్‌పై వెల్లువెత్తుతున్న ఆరోపణలు**

**భద్రతా ప్రమాణాలు శూన్యం..**

**టౌన్ ప్లానింగ్ అధికారుల మామూళ్ల రాజ్యం..!**





**ఎల్బీనగర్ అక్టోబర్ 18 ( తొలివార్త ):** హయత్ నగర్ మండలం, నాగోల్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో అక్రమ కట్టడాల దందా హద్దుమీరుతోంది. ప్రజాధనాన్ని, కాలనీ ప్రధాన రోడ్లను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై సంబంధిత యంత్రాంగాలు వహిస్తున్న మౌనం వెనుక భారీ లాలూచీ ఉందనే విమర్శలు స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతున్నాయి. చట్టానికి విరుద్ధంగా, ఉల్లంఘనలతో సాగుతున్న ఈ అక్రమ దందాను అడ్డుకోవాల్సిన ఎల్బీనగర్ ఏసీపీ ప్రతాప్, అక్రమార్కులకు రక్షణ కవచంలా మారారని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.టౌన్ ప్లానింగ్ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా చేపడుతున్న ఈ నిర్మాణాలు కాలనీ నివాసితులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఇవి భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నప్పటికీ, టౌన్ ప్లానింగ్, పోలీస్ వర్గాలు చూసీచూడనట్లు వదిలేయడం వెనుక ఏ స్థాయిలో ముడుపులు మారాయో విచారణలోనే తేలాల్సి ఉంది. ఏసీపీ స్థాయి అధికారి అండదండలు ఉన్నాయనే ధైర్యంతో ఆక్రమణదారులు సామాన్యులను, ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రజా ప్రయోజనాలను, చట్టాన్ని పూర్తిగా పక్కనబెట్టి అక్రమార్కులకు సేవ చేస్తున్న అధికారులపై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని వినాయక్ నగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ కట్టడాలను నిలిపివేసి చర్యలు తీసుకోకపోతే, కాలనీవాసులంతా ఏకమై ప్రత్యక్ష పోరాటానికి, ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

# రహదారుల నిర్మాణానికి కృషి..

**సర్పంచ్ గుగులోతు కృష్ణ నాయక్..**






**నూతనకల్, అక్టోబర్ 18 ( తొలివార్త ):** గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని సర్పంచ్ గుగులోతు కృష్ణ నాయక్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని బోటికింది తండా పిడబ్ల్యు రోడ్డు నుండి బోటికింది తండ పరిధిలోని మల్సూర్ దర్గా వరకు గ్రామపంచాయతీ నిధుల నుండి నిర్మించే రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ దర్గా గత 30 సంవత్సరాల నుండి ఇక్కడ నెలకొని ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని నేడు సర్పంచ్ చొరవతో దర్గా వరకు రోడ్డు వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.అంతకుముందు తాళ్ల సింగారం నుండి బోటికింది తండా వరకు రహదారి వెంట ఉన్న కంప చెట్లను,పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డును శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ శాఖ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీలో రాష్ట్రస్థాయిలో మెరిసిన గిరి జగదీశ్

**అండర్--14 పోటీల్లో రెండో ర్యాంక్.. గ్రామానికి గర్వకారణం**



**గుర్రంపోడు, అక్టోబర్ 18 ( తొలివార్త ):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన గిరి జగదీశ్ అండర్--14 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రెండో ర్యాంక్ సాధించాడు. కోల్ముంతలపహాడ్ గురుకుల పాఠశాలలో చదువుతున్న జగదీశ్ సాధించిన విజయంపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాసు జగదీశ్‌ను అభినందించి ప్రోత్సహించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జగదీశ్ విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## విజేతలుగా నిలిచిన కబడ్డీ జట్టు,క్రీడాకారులను అభినందించిన

**ఉప సర్పంచ్ బొల్లినేని గణేష్**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 18 ( తొలివార్త ):** బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో ఆదివారం నాడు, అశ్వాపురంబిబూర్గంపాడు మండల స్థాయి, కబడ్డీ,క్రీడా పోటీలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ క్రీడా పోటీల్లో గొల్లగూడెం క్రీడా బృందం అత్యధిక ప్రదర్శన చూపెట్టి ఫైనల్ లో ఇరవండిబిగొల్లగూడెం జట్టు లు తలపడగా మొదటి బహుమతిగా గొల్లగూడెం కబడ్డీ జట్టు విజయం సాధించడం,జరిగినది...విజయం సాధించిన క్రీడా బృందానికి ఉ ఈ కార్యక్రమం లో క్రీడా బృందం బొబ్బల హేమంత్,పోతురాజు జేస్వంత్,రాసాల ధనుష్,పిన్నబోయిన హేమంత్,శివ,బొబ్బల మనోజ్,శరత్,చెందు సురేష్,మల్లెబోయిన వెంకటేష్,జక్కుల గణేష్,గజ్జి లోహిత్,దుబాకుల వినయ్,జక్కుల మనోజ్,మర్రి మహేష్,ఎల్లబోయిన సాయి కిరణ్,పోతురాజు హరికృష్ణ,తోట తేజ,శ్రీశంత్,వెంకట్,వీరేందర్,తదితరలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి..

**మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి..**



**నూతనకల్, అక్టోబర్ 18 ( తొలివార్త ):** ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల పరిధిలోని బజరంగ్ దళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని, ఆధ్యాత్మికతతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదములను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల వెంకన్న పసుల సుధాకర్ అనంతుల నాగలింగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్,ఉత్సవ కమిటీ సభ్యులు పసుల వేణు, పసుల సుభాష్,అనంతుల విక్రం, మునిగడప భార్గవ చారి, పిల్లలమర్రి సాయి,కొలిచల్మ సాయి సిద్ధార్థ, లిఖిత్,మహేష్, సంపత్, పిల్లలమర్రి లోకేష్, అనంతుల విజయ్ తదితర భక్త ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీరామ్ నాగర్ కాలనిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**బహుమతుల ప్రదానం**



**హయత్ నగర్ అక్టోబర్ 18 ( తొలివార్త ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలను హయత్ నగర్ శ్రీరామ్ నగర్ కాలనీ లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని,మహిళలందరూ ఐకమత్యంతో ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## తరిగిపోతున్న జీవవైవిధ్యం- 52 ఏళ్లలో

## 73 శాతం తగ్గిన వన్యప్రాణుల జనాభా- మానవ తప్పిదాలే కారణమా?

**1970-2022 మధ్య దాదాపు 52 ఏళ్లలో ప్రపంచ వన్యప్రాణుల జనాభా 73.2 శాతం తగ్గింది.**

**మంచినీటి జీవుల్లోనే 85 శాతం క్షీణత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.**

ఒకప్పుడు అడవులు, నదులు, సరస్సులు, సముద్రాలు అనేక రకాల వన్యప్రాణులతో కళకళలాడేవి. కానీ గత 5 దశాబ్దాల కాలంలో పరిస్థితి తారుమారైంది. మానవ తప్పిదాలు, ప్రకృతి వనరుల్ని విపరీతంగా, విచక్షణారహితంగా వినియోగించడం వల్ల వన్యప్రాణుల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. పర్యావరణ విధ్వంసం కారణంగా 52 ఏళ్లలో ప్రపంచం తన వన్యప్రాణుల సంపదలో మూడింటి రెండొంతులకుపైగా కోల్పోయింది. ఈ సమస్య తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒకప్పుడు జీవకళతో కిటకిటలాడిన అడవులు, నదులు, సరస్సులు, సముద్రాలు నేడు మూగజీవాల వేదన, రోదనలకు నిలయంగా మారుతున్నాయి. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్), లండన్ జులాజికల్ సొసైటీ సంయుక్తంగా విడుదల చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్- 2026 నివేదిక ఈ భయాందోళనల్ని కలిగించే నిజాల్ని బయటపెట్టింది.

తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com
సోమవారం 19 - 10 - 2026

# మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హత్యకు కుట్ర రాయచోటిలో అంతర్రాష్ట్ర రౌడీ ముఠా పట్టివేత

రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని హత్య చేసేందుకు పన్నిన కుట్ర వెలుగులోకి రావడం శనివారం రాయచోటిలో కలకలం సృష్టించింది. పట్టణంలోని ఓ హోటల్ వేదికగా సాగిన ఈ వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు.రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని హత్య చేసేందుకు పన్నిన కుట్ర వెలుగులోకి రావడం శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో కలకలం సృష్టించింది. పట్టణంలోని మద్దనపల్లె రోడ్డులో ఉన్న ఓ హోటల్ వేదికగా సాగిన ఈ వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు. మారణాయుధాలు కలిగి ఉన్న అంతర్రాష్ట్ర రౌడీ ముఠాను అదుపులోకి తీసుకున్నారు.రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ నేతలతో పాటు పంజాబ్‌కు చెందిన బౌన్సర్లు, రౌడీలు మకాం వేసి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే సమాచారంతో టీడీపీ శ్రేణులు పట్టణంలోని హోటల్ వద్దకు చేరుకున్నాయి. అక్కడ ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ జరిగింది. పరస్పర దాడుల్లో ఓ కారు ధ్వంసమైంది. పోలీసులు వచ్చి, ఇరువర్గాలను చెదరగొట్టారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కదలికలపై గత 3 రోజులుగా ఈ ముఠా నిఘా ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన రౌడీలు, కర్నూలు జిల్లాకు చెందిన మరికొందరిని వైఎస్సార్సీపీ ఛైర్మన్ అభ్యర్థి జిన్నా షరీఫ్ రాయచోటికి తీసుకువచ్చారని పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం.నిందితుల నుంచి మారణాయుధాలు స్వాధీనం: రాయచోటిలోని హోటల్‌పై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో లైసెన్స్ లేని రెండు అత్యాధునిక పిస్టళ్లు, 30కి పైగా బుల్లెట్లు, గొడ్డళ్లు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో ఉన్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో రాయచోటికి చెందిన షేక్ మహమ్మద్ షరీఫ్ జిన్నా, షేక్ మహమ్మద్ కైఫ్, మహ్మద్ సైఫ్, మహమ్మద్ రఫీక్, కొండూరు జహీద్‌బాబు, మహమ్మద్ ఆరిఫ్, పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాకు చెందిన టార్లెమ్ సింగ్, గురుదాస్‌పూర్ జిల్లాకి చెందిన సరబ్‌జీత్ సింగ్, జలంధర్ జిల్లాకు చెందిన ప్రభుజీత్ సింగ్, జలంధర్‌కు చెందిన అమితాజ్, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన రవికుమార్, అనిల్, సాధిక్ అలీ, ఉదయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటిలో విలేకరుల సమావేశంలో తీవ్రంగా స్పందించారు. కిరాయి ముఠాలతో రాయచోటిలో భయాందోళనలు సృష్టించేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో పాటు అసలు సూత్రధారుల పాత్రపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు."ఢిల్లీ, హైదరాబాద్, పంజాబ్ తదితర ప్రాంతాల నుంచి కిరాయి ముఠాలను రప్పించి రాయచోటిలో భయాందోళనలు సృష్టించేందుకు కుట్ర పన్నారు. ఎప్పుడూ లేని సంస్కృతి రాయచోటిలో బయటపడింది. బయట రాష్ట్రాల నుంచి కిరాయి మూకలను తీసుకువచ్చి ఇక్కడ ఎన్నికల్లో గెలుపొందే విధంగా ప్రణాళికాబద్ధంగా మూడు రోజుల నుంచి నిఘా పెట్టారు." - రాంప్రసాద్ రెడ్డి, మంత్రి.

# ఆకాశంలో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారంగా మారిన పండుగ ఖర్చులు

ఎల్‌నినో ప్రభావంతో బియ్యం, పప్పులు, వంటనూనెలు, కూరగాయల ధరలు సగటు వినియోగదారులను బెంబేలెత్తిస్తోన్నాయి. తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితుల కారణంగా దసరా, బతుకమ్మ పర్వదినం వేళ వంటింటి బడ్జెట్ 30 శాతం పైగా పెరిగిపోయింది. సూపర్ ఎల్‌నినో ప్రతాపం చూపిస్తోంది. అనూహ్య వాతావరణ మార్పులు, అంతర్జాతీయంగా యుద్ధ, ఇతర పరిణామాలు వెరసి భారతీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. మునుపెన్నడూ లేని విధంగా కీలక వ్యవసాయ రంగం కుదేలవుతున్న ప్రతికూల పరిస్థితుల నడుమ దసరా, బతుకమ్మ పండుగల వేళ నిత్యావసర వస్తువుల ధరలు వణికిస్తున్నాయి. రాష్ట్రంలో బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. కేవలం 2, 3 నెలల్లో ధరలు పైపైకి ఎగిసిపడుతుండటంతో గ్రామీణ ప్రాంతాలే కాకుండా పట్టణాలు, నగరాల్లో సైతం పేద, మధ్య తరగతి కుటుంబాలు హడలిపోతున్నాయి.

**మార్కెట్లో వీటి రేట్లు బెంబేలెత్తిస్తున్నాయి**

సాధారణ బియ్యం కిలో ధర రూ.60 నుంచి రూ.70, సన్న బియ్యం కిలో ధర రూ.85 నుంచి రూ.90 వరకు పెరిగిపోయాయంటే విస్మయం కలుగుతోంది. నిత్యం వంటింట్లో వాడే కంది పప్పు కిలో ధర రూ.150 నుంచి రూ.160కి పైగా పెరిగిపోయింది. కిలో ఉల్లిపాయ రేటు రూ.55 నుంచి రూ.80కి పైగా ఎగబాకింది. ఇక వంట నూనెలైన పల్లీ, పామాయిల్, పొద్దు తిరుగుడు లీటరు రూ.120 నుంచి రూ.180 చొప్పున అమ్ముడుపోతుండటంతో 'సామాన్యుడు బతికేదెలా' అంటూ వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.'బియ్యానికి డిమాండ్ చాలా పెరిగింది. దీంతో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. స్టాక్ లేక మన దగ్గర కూడా రేట్లు చాలా పెరిగాయి. ఖరీఫ్ పంటలు చేతికొస్తే కొంత వరకు తగ్గొచ్చు. కానీ ఈసారి వర్షాలు లేక వరి సాగు తగ్గింది. ఏమవుతుందో చూడాలి" - ఓ బియ్యం వ్యాపారి

**అధిక ధరలతో ప్రజల్లో ఆందోళన**

రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతి నెలా పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. 1.06 కోట్ల రేషన్ కార్డులుండగా 3.45 కోట్ల మందికి దాదాపు 250 లక్షల మెట్రిక్ టన్నులు పంపిణీ చేస్తోంది. రాష్ట్ర జనాభాలో 85 శాతం జనాభాకు ఉచిత బియ్యం పౌర సరఫరా వ్యవస్థ ద్వారా అందుతోంది. అయినప్పటికీ ధరలు పెరగడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**175 మండలాల్లో కరవు తాండవం**

ఇక ఈ ఏడాది ఖరీఫ్ పంటకాలం పూర్తై రబీ కోసం సన్నద్ధమవుతున్న దృష్ట్యా రాష్ట్రంలో 20 శాతం పైగా లోటు వర్షపాతం కనిపిస్తోంది. 353 మండలాల్లో తీవ్ర వర్షాభావం, 175



మండలాల్లో కరవు కాటకాలు కమ్ముకుని భయాందోళనలకు గురి చేస్తోంది. ఎల్‌నినో ప్రతికూల ప్రభావం వేళ ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ జోక్యం చేసుకుని ధరలకు కళ్లెం వేయాలని వినియోగదారులు కోరుతున్నారు."నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లిపాయలు కేజీ రూ.100 చెబుతున్నారు. పప్పులు, నూనెల రేట్లు విపరీతంగా పెరిగాయి. సామాన్యులపైనే ఎక్కువ భారం పడుతోంది. ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలి" - వినియోగదారులు రాయితీ ధరలకు ప్రభుత్వం సరకులు అందించడం, అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవడం వంటి పరిష్కారాల ద్వారా ధరలు తగ్గించడంలో సహాయపడాలని సామాన్యులు అభ్యర్థిస్తున్నారు.

# ఢిల్లీ నిరసనల వెనుక పెద్ద స్కెచ్: బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

**ఢిల్లీ ఓటర్ల జాబితా నిరసనలపై బీజేపీ ఎంపీ కొండా సంచలన వ్యాఖ్యలు**

**భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యతో వివాదాన్ని ముడిపెట్టిన వైనం**

**ప్రధాని మోదీకి వ్యతిరేకంగా 'రెజీమ్ ఛేంజ్' కుట్ర జరుగుతోందని ఆరోపణ**

**ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే గతంలో చొరబాట్లను ప్రోత్సహించారన్న ఎంపీ**

**విపక్షాల ఏకైక అజెండా ప్రధాని మోదీని ఓడించడమేనని విమర్శ**

ఢిల్లీలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల వెనుక భారీ కుట్ర దాగి ఉందని తెలంగాణ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఒకప్పుడు భారత్-బంగ్లాదేశ్ మధ్య



దశాబ్దాలుగా నలిగిన సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యకు, ప్రస్తుత ఆందోళనలకు సంబంధం ఉందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని గద్దె దించాలనే ఏకైక లక్ష్యంతో విపక్షాలు, కొన్ని విదేశీ శక్తులు కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై ఆయన విడుదల చేసిన ఒక వీడియో ప్రస్తుతం విస్తృతంగా ప్రచారంలో ఉంది. 2015కు ముందు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రపంచంలోనే అత్యంత విచిత్రంగా ఉండేదని విశ్వేశ్వర్ రెడ్డి వివరించారు. "బంగ్లాదేశ్‌లో భారత్‌కు చెందిన 111 ఎన్‌క్లేవ్‌లు (చిన్న భూభాగాలు), భారత్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 51 ఎన్‌క్లేవ్‌లు ఉండేవి. ఈ ప్రాంతాల్లోని ప్రజలకు సరైన గుర్తింపు, పౌరసత్వం, ప్రభుత్వ సేవలు అందేవి కావు" అని ఆయన గుర్తుచేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 2015లో చారిత్రక భూ సరిహద్దు ఒప్పందం ద్వారా ఈ సమస్యను పరిష్కరించిందని తెలిపారు.అలాంటి అసంబద్ధమైన సరిహద్దుల వల్ల అక్రమ వలసలు పెరిగిపోయాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని పార్టీలు దీనిని ప్రోత్సహించాయని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, అసోంలో కాంగ్రెస్ పార్టీలు ఈ వలసలను ప్రోత్సహించాయని, దాని ప్రభావం హైదరాబాద్, ఢిల్లీ, బీహార్, ఒడిశా వరకు పాకిందని అన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తుంటే, అదే శక్తులు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు."విపక్షాలకు నీట్, యూపీఐ, ఎన్నికల సంఘం వంటి అంశాలపై ఉమ్మడి అభిప్రాయం లేదు. వారి ఏకైక ఉమ్మడి లక్ష్యం ప్రధాని మోదీని ఓడించడం, అధికార మార్పు తీసుకురావడం" అని విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఒక నేతకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కసారిగా లక్షలాది ఫాలోవర్లు పెరగడం నూటికి నూరు శాతం నకిలీ అని, డబ్బుతో సృష్టించినవేనని ఆయన ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కరెన్సీ, చమురు వాణిజ్యం, ఐటీ, ఫార్మా రంగాలపై కూడా ఒత్తిడి తెస్తున్నారని, ప్రధాని మోదీ బలమైన నాయకత్వం వల్లే దేశం నిలదొక్కుకోగలుగుతోందని ఆయన అన్నారు.

# చీకటి, తొక్కిసలాట, ఓ ప్రకటన.. కోల్‌కతాలో మృత్యుఘోష జరిగింది ఇదే!

**దుర్గామాత వేడుకల్లో అంతులేని విషాదం**

**కోల్‌కతాలో 19 మంది భక్తుల దుర్మరణం**

**వర్షంతో ఒక్కసారిగా లోపలికి చొచ్చుకొచ్చిన భక్తులు**

**ఇరుకైన దారి, చీకటితో పెరిగిన ఘోరం**

**'లోపలికి రండి' అనే ప్రకటనతో ఒక్కసారిగా పెరిగిన రద్దీ**

**ఊపిరాడక కుప్పకూలిన జనం**

**నిర్వాహకుల అరెస్ట్.. మృతుల కుటుంబాలకు భారీ పరిహారం**

ఆనందోత్సాహాలతో వెలిగిపోవాల్సిన పండగ పందిరి. ఆర్తనాదాలతో నిండిపోయింది. భక్తి పారవశ్యంతో మార్మోగాల్సిన ప్రాంగణం.. మృత్యుఘోషతో దద్దరిల్లింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరాన్ని పెను విషాదం కమ్మేసింది. పవిత్ర దుర్గా నవరాత్రుల్లో భాగంగా సప్తమి రోజున, ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బాగన్ సర్బోజనిన్ పూజా పందిరిలో జరిగిన తొక్కిసలాటలో 13 మంది మహిళలు, ఒక చిన్నారి సహా 19 మంది భక్తులు అసువులు బాశారు. మరో 25 మందికి పైగా తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.అసలేం జరిగింది.. క్షణాల్లో మారిన దృశ్యం శనివారం సాయంత్రం. పండగ శోభతో చోర్‌బాగన్‌లోని సారదా పార్క్ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు పందిరి వద్ద బారులు తీరారు. సాయంత్రం 7:40 గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. బయట క్యూలలో వేచి ఉన్న వందలాది మంది భక్తులు వర్షం నుంచి తలదాచుకోవడానికి ఒకేసారి పందిరి లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు.అదే సమయంలో, "వర్షం వస్తోంది, లోపలికి రండి" అంటూ నిర్వాహకులు చేసిన ఓ ప్రకటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. పందిరి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు అత్యంత ఇరుకుగా ఉండటం, లోపల సరైన వెలుతురు లేకపోవడంతో పెను విషాదం చోటుచేసుకుంది. ముందున్న వారు అదుపుతప్పి కిందపడిపోయారు. వెనుక నుంచి వెల్లువెత్తిన జన ప్రవాహం కిందపడిన వారిని గమనించకుండానే వారిపై నుంచే ముందుకు సాగింది. చీకటిలో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే, ఊపిరాడక, బరువైన ఒత్తిడికి తట్టుకోలేక 17 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు.క్షణముందే భద్రతా వైఫల్యం.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, ప్రమాద సమయంలో పందిరిలో ఏసీలు పనిచేయకపోవడంతో తీవ్రమైన ఉక్కపోత నెలకొంది. కనీస సంఖ్యలో వాలంటీర్లు, పోలీసు సిబ్బంది లేకపోవడం, జన నియంత్రణకు ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకపోవడం ఈ ఘోరానికి ప్రధాన కారణాలని బాధితులు ఆరోపిస్తున్నారు. "ఒకరిపై ఒకరు పడుతూ నరకయాతన అనుభవించారు. మా కళ్ల ముందే ఎంతోమంది ఊపిరి వదిలారు" అంటూ ఓ ప్రత్యక్ష సాక్షి కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వ స్పందన, తక్షణ చర్యలు ఈ దుర్ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న 12 మంది నిర్వాహకులు, వాలంటీర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి గ్రూప్-డి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పీఎం సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ పెను విషాదం, దేశవ్యాప్తంగా పండగల సమయంలో భద్రతా ప్రమాణాల విషయంలో నిర్వాహకుల నిర్లక్ష్యానికి, జన నియంత్రణలో అధికారుల వైఫల్యానికి నిలువుటద్దం పడుతోంది.

# ఏపీకి గోదావరి బోర్డులో ఎదురుదెబ్బ.. ఆ ప్రాజెక్టుల జోలికి వెళ్లలేమన్న బోర్డు

**తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చిన గోదావరి బోర్డు**

**అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించే అధికారం లేదని స్పష్టీకరణ**

**ఈ నెల 30న జరగనున్న బోర్డు సమావేశం**

**నిధులు, టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై అజెండాలో చర్చ**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్



ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తోసిపుచ్చింది. ఇప్పటికే అన్ని అనుమతులు పొందిన ప్రాజెక్టుల గురించి మళ్లీ చర్చించే అధికారం తమకు లేదని బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ అభ్యంతరాలను పక్కన పెడుతూ నిర్ణయం తీసుకుంది.కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ)ల నుంచి అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించలేమని గోదావరి బోర్డు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను బోర్డు పరిగణనలోకి తీసుకోలేదు.మరోవైపు, ఈ నెల 30వ తేదీన జరగనున్న బోర్డు సమావేశానికి సంబంధించిన అజెండాను ఉభయ రాష్ట్రాలకు పంపింది. గత 17వ సమావేశపు మినిట్స్‌ను ఆమోదించడం, బోర్డు నిర్వహణకు తెలుగు రాష్ట్రాలు నిధులు కేటాయించడం, ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యతను కొలిచేందుకు టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు వంటి కీలక అంశాలను అజెండాలో చేర్చారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టుల మదింపు పురోగతిపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు. అయితే, తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏపీ అభ్యంతరాలకు అజెండాలో చోటు కల్పించకపోవడం గమనార్హం.

# విజయనగరంలో వేర్వేరుగా బరిలోకి టీడీపీ, జనసేన

**విజయనగరంలో టీడీపీ-జనసేన నేతల్లో అసంతృప్తి**

**గెలుపు అవకాశాలు తక్కువ ఉన్న సీట్లు ఇచ్చారంటున్న జనసేన నాయకులు**

**విజయనగరం మేయర్ అభ్యర్థిగా జనసేన నేత భార్య స్వతంత్ర నామినేషన్**

**నెల్లిమర్లలో బీజేపీకి ఛైర్మన్ పదవిపై టీడీపీ, జనసేన కార్యకర్తల అసమ్మతి రాగం**



విజయనగరం జిల్లాలో సీట్ల సర్దుబాటు వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో జనసేన నాయకులు తిరుగుబాటు అభ్యర్థులుగా మారి స్వతంత్రంగా నామినేషన్లు దాఖలు చేయడం రాజకీయంగా కలకలం రేపుతోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, నెల్లిమర్ల నగర పంచాయతీ ఎన్నికల్లో సీట్ల కేటాయింపులపై జనసేన తీవ్ర అసంతృప్తితో ఉంది. గెలుపు అవకాశాలు తక్కువగా ఉన్న స్థానాలను తమకు కేటాయిస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై శనివారం రాత్రి వరకు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, బొబ్బిలి ఎమ్మెల్యే అప్పల నాయుడు జనసేన నేతలతో చర్చలు జరిపినప్పటికీ ఏకాభిప్రాయం కుదరలేదు. సంప్రదింపులు విఫలం కావడంతో జనసేన నాయకులు స్వతంత్రంగా బరిలోకి దిగారు. జనసేన నాయకుడు గూరన అయ్యాల సతీమణి గూరన రాధిక, విజయనగరం మేయర్ అభ్యర్థిగా స్వతంత్రంగా నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పాటు మరో 12 డివిజన్లలో జనసేన నేతలు కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఇదే తరహా పరిస్థితి నెల్లిమర్ల నగర పంచాయతీలోనూ నెలకొంది. అక్కడ ఛైర్మన్ పదవిని మిత్రపక్షమైన బీజేపీకి కేటాయించడంపై టీడీపీ, జనసేన శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. దీని ప్రభావంతో బీజేపీ అభ్యర్థులకు పోటీగా ఈ రెండు పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం.

# ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు.. సర్టిఫికెట్ కోసం జేఏసీ డిమాండ్

**ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల గెలుపు సర్టిఫికెట్‌పై వివాదం**

**ధ్రువపత్రం జారీలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని జేఏసీ విమర్శ**

**ఎన్నికల మొదట్నుంచీ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ**

**వెంటనే జోక్యం చేసుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి విజ్ఞప్తి**



టీజీఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన తమకు ధ్రువీకరణ పత్రం (విక్టరీ సర్టిఫికెట్) అందజేయడంలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆరోపించింది. ఎన్నికల్లో గెలుపొందిన తమకు వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నేతలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)లతో కూడిన జేఏసీ కూటమి ఘన విజయం సాధించింది. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి అనేక రోజులు గడుస్తున్నా కార్మిక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా అనవసరంగా ఆలస్యం చేస్తున్నారని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే కార్మిక శాఖ అధికారులు తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని జేఏసీ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. కార్మిక శాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని నేతలు స్పష్టం చేశారు.

# సొంతూరు బాట పట్టిన నగరం 46 కిలోమీటర్ల ప్రయాణానికి 3 గంటల సమయం




దసరా, సంక్రాంతి సెలవుల్లో విజయవాడ-హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ పెరగడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం దీనికి తోడు చౌటుప్పల్, చిట్యాలలో అండర్ పాస్ పనులు జరుగుతుండటంతో గంటల తరబడి రద్దీ నెలకొంటోంది. దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ సొంతూళ్ల బాట పట్టారు. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ప్రయాణికులతో రోడ్లు, బస్టాండ్లు కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి పంతంగి టోల్ ప్లాజా వరకు 46 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణ సమయాల్లో దాదాపు గంటసేపట్లో ఈ దూరాన్ని చేరుకోవచ్చు. అయితే వాహనాల రద్దీ భారీగా పెరగడంతో పాటు చౌటుప్పల్ దగ్గర అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ప్రస్తుతం ఈ ప్రయాణానికి దాదాపు 3 గంటల సమయం పడుతోంది. టోల్‌ప్లాజా దగ్గర అరకిలోమీటరు బారులుచౌటుప్పల్ నుంచి ధర్మోజిగూడెం మధ్యలో సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు లక్కారం నుంచి కొంత ట్రాఫిక్‌ను వలిగొండ రోడ్డు మీదుగా విజయవాడ జాతీయ రహదారికి మళ్లించారు. ఇక పంతంగి టోల్ ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో అర కిలోమీటరు మేర వాహనాలు లేన్లలో నిలిచిపోతున్నాయి. ఈ రద్దీని నియంత్రించేందుకు టోల్‌ప్లాజా సిబ్బంది విజయవాడకు వెళ్లే మార్గంలో 12 టోల్ బూత్‌లను తెరిచి, వాహనాలను తరలించారు. ఈ మార్గంలో రేపు కూడా ఇదే తరహా ట్రాఫిక్ ఉండే అవకాశం ఉంది. చౌటుప్పల్ దాటినా చిట్యాలలో మళ్లీ బ్రేక్‌చౌటుప్పల్ దగ్గర జరుగుతున్న అండర్ పాస్ నిర్మాణ పనుల దృష్ట్యా ఈ పట్టణాన్ని దాటడానికి సుమారు 45 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. రాత్రిపూట ఈ ప్రయాణ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ చౌటుప్పల్ దాటినా చిట్యాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇక్కడ ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటంతో సాధారణంగానే వాహనాలు నిదానంగా వెళ్తుండటంతో ట్రాఫిక్ ఏర్పడుతుంది. ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో ఈ రద్దీ 4 రెట్లు పెరిగింది. దీంతో ఇక్కడ కూడా వాహనదారులు సుమారు గంట సేపు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు.

# ఉరుములు, మెరుపులతో కూడిన వానలు రాష్ట్రంలోని పలు జిల్లాలకు వర్షసూచన



తెలంగాణలోని పలు జిల్లాల్లో నేడు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఆదివారం, సోమవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, హైదరాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మంగళవారం, బుధవారాల్లో కూడా పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దక్షిణ కోస్తాంధ్ర నుంచి వాయువ్య బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇంకోవైపు శనివారం భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి తదితర జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిశాయి.

**వర్షంతో స్థానికుల హర్షం**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక అల్లాడుతున్న వేళ నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలో శనివారం అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. సుమారు అర్ధ గంటకు పైగా తీవ్రమైన ఉరుములతో వాన దంచికొట్టింది. చాలా రోజుల తర్వాత కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారగా స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. నీటి ఎద్దడితో సతమతమవుతున్న పంటలకు సైతం ఈ వర్షం ఓ తడిని అందించడంతో వారం పాటు ఇబ్బంది లేదని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొలివార్త
సోమవారం 19 - 10 - 2026

## అమ్రపాలి గ్రూప్ మనీలాండరింగ్ కేసు.. రూ. 54.71 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిన ఈడీ




సంచలనాత్మక అమ్రపాలి గ్రూప్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈడీ లక్నో జోనల్ కార్యాలయం సుమారు రూ. 54.71 కోట్ల విలువైన భారీ స్థిరాస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తాజాగా జప్తు చేసింది. న్యూఢిల్లీలోని అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాంతమైన మహారాణి బాగ్‌లో ఉన్న 3 (న్యూ) నంబరు గల ఈ ఆస్తిని 'సుర్భి అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరు మీద నమోదు చేసినట్లు దర్యాప్తులో తేలింది. కొనుగోలుదారులను మోసగించిన ఈ కేసులో ఉత్తరప్రదేశ్ పోలీసులు, ఢిల్లీ పోలీసులు అలాగే ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ నమోదు చేసిన మొత్తం 18 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఈ విస్తృత దర్యాప్తు చేపట్టింది. అమ్రపాలి గ్రూప్, దాని డైరెక్టర్లు మరియు ప్రమోటర్లు తాము చేపట్టే రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను కేవలం 36 నెలల్లోపే పూర్తి చేసి ఫ్లాట్లు అందజేస్తామని, అంతేకాకుండా పెట్టుబడిపై ఆకర్షణీయమైన రాబడి ఇస్తామని అమాయక ప్రజలను నమ్మించారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం కాలపరిమితిలోగా ఏ ఒక్క ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకపోగా, వేలాది మంది కొనుగోలుదారులు తమ కష్టార్జితాన్ని కోల్పోయి ఇళ్లూ రాక, డబ్బులూ రాక రోడ్డున పడ్డారు. ఈ కుంభకోణానికి సంబంధించి నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో ఏకంగా రూ. 5,000 కోట్లకు పైగా నిధులు దారి మళ్లినట్లు విస్మయకరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. గృహ కొనుగోలుదారుల నుంచి రియల్ ఎస్టేట్ నిర్మాణం కోసం సేకరించిన వేల కోట్ల రూపాయలను ఇతర వ్యాపారాలకు తరలించినట్లు ఈడీ గుర్తించింది. ఈ నిధుల మళ్లింపునకు అనేక షెల్ కంపెనీలను, గ్రూప్ సంస్థలను అడ్డుపెట్టుకున్నారు. వృత్తిపరమైన ఫీజుల ముసుగులో విపరీతంగా నిధులను బదిలీ చేసినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. అమ్రపాలి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ శర్మ కుటుంబ సభ్యుల ప్రమేయంతో ఈ నిధులు సుర్భి అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రుణాలు మరియు ఇతర రూపాల్లో చేరినట్లు ఈడీ పేర్కొంది.దుబాయ్‌లో క్రెడిట్ కార్డుతో ఇల్లు బుక్ చేసుకుంటున్నారా.. అయితే ఈ ఆర్బీఐ హెచ్చరిక గురించి తప్పక తెలుసుకోండి.. ఈ అక్రమ మార్గాల ద్వారా సమకూర్చుకున్న ఈ ఆస్తులన్నింటినీ చట్టవిరుద్ధంగా సంపాదించిన 'నేర ఆదాయం' గా గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ప్రస్తుత జప్తు ప్రక్రియను పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో కలకలం సృష్టించిన ఈ భారీ మోసానికి సంబంధించి తదుపరి చట్టపరమైన చర్యలను వేగవంతం చేసిన ఈడీ, ప్రమోటర్ల అక్రమాస్తుల గుర్తింపుపై దృష్టి సారించింది. బాధితులైన గృహ కొనుగోలుదారులకు న్యాయం చేసే దిశగా ఈ దర్యాప్తు కీలక పరిణామంగా నిలవనుంది.

## దీపావళికి ముందే ఐపీఓల జాతర.. రూ.50 వేల కోట్లు టార్గెట్.. ఈ టాప్ కంపెనీలపై లుక్కేసుకోండి




దేశీయ ఈక్విటీ మార్కెట్లలో అస్థిరత కొనసాగుతున్నప్పటికీ, ప్రైమరీ మార్కెట్ మాత్రం రికార్డు స్థాయి నిధుల సమీకరణతో రికార్డులు సృష్టిస్తోంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా 70 మెయిన్‌బోర్డ్ ఐపీఓలు పెట్టుబడిదారుల నుండి రూ. 90,500 కోట్లకు పైగా సమీకరించగా, అదే జోరు అక్టోబర్ 2026లోనూ కొనసాగుతోంది. రాబోయే దీపావళి పండుగ నాటికి దాదాపు డజనుకు పైగా అగ్రగామి కంపెనీలు తమ ఐపీఓల ద్వారా ప్రాథమిక మార్కెట్ నుండి రూ. 50,000 కోట్ల భారీ నిధులను సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. గ్లోబల్ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, గత కొన్ని వారాలుగా కొత్తగా లిస్ట్ అయిన కంపెనీలు ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులను అందించడమే ఈ ఉత్సాహానికి ప్రధాన కారణం. ఈ భారీ ఐపీఓల పండుగలో టెలికామ్ రంగానికి చెందిన 'జియో ప్లాట్‌ఫామ్స్' ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ మెగా ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 31,000 నుండి రూ. 32,000 కోట్ల నిధులను సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా, ఈ ఐపీఓ అక్టోబర్ 21 బుధవారం నాడు సబ్‌స్క్రిప్షన్ కోసం ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా అవదా ఎలక్ట్రో (కార్ల్స్‌బర్గ్ ఇండియా రూ. 6,500 కోట్ల ఇష్యూతో అక్టోబర్ నాటికి మార్కెట్ లోకి రానుంది) ఈ నెల ద్వితీయార్థంలో రూ. 7,600 కోట్ల ఐపీఓతో ముందుకు రానుంది. మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నుండి ఇప్పటికే తుది అనుమతులు లభించడంతో పండుగ సీజన్ ముందే ఈ ఇష్యూలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. వచ్చే వారం పండుగ వాతావరణాన్ని మరింత పెంచుతూ మరికొన్ని ప్రముఖ ఐపీఓలు తమ ధరల శ్రేణిని ప్రకటించనున్నాయి. వీటిలో హెచ్‌డి ఫైర్ సిస్టమ్స్ (అక్టోబర్ 13) మరియు ఫ్యూజన్ సిస్టమ్స్ (అక్టోబర్ 14) వరుసగా ప్రారంభమై ఉమ్మడిగా రూ. 1,414 కోట్లు సేకరించనున్నాయి. వీటితో పాటు సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ మరియు జెట్‌వర్క్ మ్యానుఫ్యాక్చరింగ్ బిజినెస్‌లు సంయుక్తంగా రూ. 5,500 కోట్లు, బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ రూ. 2,500 కోట్లు, పారస్ హెల్త్‌కేర్ రూ. 1,800 కోట్లు, టొరెంట్ గ్యాస్ రూ. 4,000 కోట్లు, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ రూ. 250 కోట్లు మరియు ఎన్‌డిఆర్ ఇన్విట్ ట్రస్ట్ రూ. 750 కోట్లను దారితీయనున్నాయి. టోన్బో ఇమేజింగ్ (1.81 కోట్ల ఈక్విటీ షేర్ల , ఎస్ఎఫ్‌సి ఎన్విరాన్‌మెంటల్ మరియు బాంబే కోటెడ్ స్టీల్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. 980% రిటర్న్ ఆశ చూపి రూ.1.3 కోట్లు మోసం.. బెంగళూరు ఉద్యోగిని నిలువునా ముంచిన కేటుగాళ్లు.. అసలు స్కామ్ ఇదే ఈ అనూహ్య జోరుపై జెరోధా సీఈఓ నితిన్ కామత్ స్పందిస్తూ, ప్రస్తుతం మార్కెట్‌లో ఐపీఓలు మాత్రమే నిజమైన పండుగ వాతావరణాన్ని నింపుతున్నాయని, దాదాపు 67.2 శాతం మెయిన్‌బోర్డ్ ఐపీఓలు ఇష్యూ ధర కంటే పైనే ట్రేడ్ అవుతున్నాయని విశ్లేషించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో (ఎ1 27) 78 కంపెనీలు రూ. 94,200 కోట్లను సమీకరించడం ప్రాథమిక మార్కెట్ బలాన్ని చాటుతోంది. బలమైన కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు, స్థిరమైన దేశీయ డిమాండ్ మరియు మెరుగైన నగదు ప్రవాహాల మద్దతుతో రాబోయే 12 నుండి 24 నెలల్లో నాణ్యమైన స్మాల్‌క్యాప్, బీఎఫ్ఎస్ఐ, ఐటీ మరియు టెలికాలంలో విపరీతమైన పెట్టుబడి అవకాశాలు లభిస్తాయని మోనార్క్ ఏఐఎఫ్ అభిప్రాయపడింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

## అమెరికా నిర్ణయం ఐటీ కంపెనీలపై ప్రభావం చూపకపోవచ్చు.. నాస్కామ్..!




శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం కింద కొత్త దరఖాస్తులు దాఖలు చేయకుండా పలు ప్రధాన టెక్నాలజీ కంపెనీలను అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై నాస్కామ్ స్పందించింది. వలసలు, నైపుణ్యం గల ప్రతిభావంతుల బదిలీ అనేవి రెండు వేర్వేరు అంశాలని, వాటిని ఒకే కోణంలో చూడకూడదని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ పేర్కొంది. అమెరికా కార్మిక శాఖ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిర్దిష్ట వలస మార్గాన్ని ప్రభావితం చేసినప్పటికీ, భారతీయ టెక్నాలజీ కంపెనీలు గత కొన్నేళ్లుగా హెచ్-1బి వీసాలపై తమ ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకున్నాయని, స్థానిక నియామకాలను విస్తరించాయని, అమెరికాలో బలమైన దేశీయ కార్మిక శక్తిని నిర్మించుకున్నాయని నాస్కామ్ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.అమెరికాలో పనిచేస్తున్న భారతీయ టెక్నాలజీ కంపెనీలతో సహా కొన్ని ఐటీ కంపెనీలను, శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం కింద కొత్త దరఖాస్తులు దాఖలు చేయకుండా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఈ రోజు ప్రకటించింది. ఈ నిర్ణయం ఒక నిర్దిష్ట వలస మార్గాన్ని ప్రభావితం చేస్తున్నప్పటికీ, వలసలు, నైపుణ్యం గల ప్రతిభావంతుల బదిలీ అనేవి రెండు వేర్వేరు అంశాలని, వాటిని ఒకే కోణంలో చూడకూడదని నాస్కామ్ చెబుతూనే ఉంది. అమెరికాలో స్వల్పకాలిక నైపుణ్యాల కొరతను తీర్చడంలో హెచ్-1బి వీసా కార్యక్రమం చారిత్రాత్మకంగా కీలక పాత్ర పోషించిందని గుర్తు చేసింది. అదరగొట్టిన టీసీఎస్ ఫలితాలు.. ఒక్కో షేరుకు రూ.12 డివిడెండ్..! భవిష్యత్తులో కూడా స్వల్పకాలిక ప్రతిభ కొరతను తీర్చడానికి దీనిని ఉపయోగించడం కొనసాగుతుందని పేర్కొంది. అయితే గత కొన్నేళ్లుగా భారతీయ టెక్నాలజీ కంపెనీలు హెచ్-1బి వీసాలపై తమ ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకున్నాయి. అదే సమయంలో అమెరికాలో స్థానిక నియామకాలను స్థిరంగా విస్తరిస్తూ, బలమైన దేశీయ శ్రామిక శక్తిని నిర్మించుకుంటున్నాయని విశ్లేషించింది. అమెరికాలోని చాలా ఫార్చ్యూన్ 500 కంపెనీలతో భారతీయ టెక్నాలజీ కంపెనీలు కలిసి పనిచేస్తున్నాయని, ఇది మరిన్ని స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తూనే, ఆవిష్కరణలు చేయడానికి, అభివృద్ధి చెందడానికి వీలు కల్పిస్తోందని నాస్కామ్ తెలిపింది. ప్రక్రియ ద్వారా హెచ్-1బి వీసాల నుండి శాశ్వత నివాసానికి మారే ఉద్యోగుల సంఖ్య చాలా పరిమితంగా ఉందని పేర్కొంది. భారతీయ టెక్నాలజీ కంపెనీలు 80కి పైగా దేశాలలో పనిచేస్తున్నాయని, స్థానిక చట్టాలు, నియంత్రణ అవసరాలను పాటించడంలో తమ నిబద్ధతను నిలకడగా ప్రదర్శించాయని కూడా పేర్కొంది. అమెరికా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం నుంచి కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సిఎల్, క్యాప్‌జెమిని వంటి ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద ఐటీ అవుట్‌సోర్సింగ్ సంస్థలను అమెరికా ప్రభుత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా నిర్ణయం అక్కడున్న భారతీయులకు షాక్ అని చెప్పొచ్చు. అక్కడ ఉద్యోగం వెతుక్కుంటున్న భారతీయులకు భారతీయ కంపెనీ ఉద్యోగం దొరక్కపోవచ్చు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.వా

## ఆర్‌బీఐ కీలక నిర్ణయం- నాలుగేళ్ల తర్వాత రెపో రేటు పెంపు




ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటన- రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ 5.50 శాతానికి చేరుకున్న రెపోరేటు- దాదాపు నాలుగేళ్ల తర్వాత రెపోరేటు పెంచిన ఆర్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను సవరించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25శాతం) పెంచింది. దీంతో రెపో రేటు 5.50శాతానికి చేరింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. 2023 ఫిబ్రవరి తర్వాత వడ్డీరేట్లను ఆర్‌బీఐ పెంచడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐ తాజా వడ్డీ రేట్ల పెంపు నిర్ణయంతో గృహ, వాహన రుణాలు మరింత ప్రియం కానున్నాయి.

### పటిష్ఠంగా దేశ ఆర్థిక వ్యవస్థ : ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా ఉందని, ఆర్థిక కార్యకలాపాలు స్థిరంగా, విస్తృతంగా కొనసాగుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆర్ బీఐ పాలసీ వైఖరిని న్యూట్రల్ నుంచి క్యాలిబ్రేటెడ్ టైటనింగ్ వైపు మారుస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండే ప్రసక్తే లేదని, మున్ముందు వడ్డీ రేట్ల పెంపు లేదా స్థిరంగా ఉంచడం మాత్రమే ఉంటుందని తేల్చి చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగానే ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, సరఫరా గొలుసులో అంతరాయాలు వంటివి భవిష్యత్తులో దేశీయ ఆర్థిక కార్యకలాపాలపై కొంతమేర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేశారు. "ప్రపంచంలో అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026-27)లో దేశ జీడీపీ వృద్ధి రేటు 40 బేసిస్ పాయింట్లు పెరిగి 7.1 శాతానికి చేరొచ్చు. ప్రపంచంలోని భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా పెరిగిన వస్తువుల ధరలు, ప్రపంచ వాణిజ్యంలో ఘర్షణలు, కఠినతరమవుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు దేశ వృద్ధి అంచనాలపై కొంత మేర ప్రతికూల ప్రభావం చూపొచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది జీడీపీ వృద్ధి 7.1 శాతంగా ఉండొచ్చు. రెండో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో త్రైమాసికంలో 6.9 శాతం, నాలుగో త్రైమాసికంలో 6.8 శాతం వృద్ధి ఉంటుందని అంచనా. "సంజయ్ మల్హోత్రా, ఆర్‌బీఐ గవర్నర్

### 'నికర ఎగుమతుల వాటా కూడా సానుకూలంగానే ఉంది'

బలమైన పెట్టుబడుల మద్దతుతో మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. నికర ఎగుమతుల వాటా కూడా సానుకూలంగానే ఉందన్నారు. గత త్రైమాసికంతో పోలిస్తే వృద్ధి రేటు కొంత మందగించినప్పటికీ, రెండో త్రైమాసికానికి సంబంధించిన హై ఫ్రీక్వెన్సీ సూచికలు ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయని సూచిస్తున్నాయని తెలిపారు. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, బలమైన ఎల్ నినో పరిస్థితులు రాబోయే రబీ సీజన్‌ను ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడ్డారు. దీంతో గ్రామీణ ఆర్థిక రంగం ప్రభావితం అయ్యే ఛాన్స్ ఉందని అంచనా వేశారు.

## బ్యాంక్ ఎఫ్‌డీ కంటే పోస్టాఫీస్ స్కీమ్‌లోనే అధిక ఆదాయం

**రూ.9 లక్షల పెట్టుబడిపై పోస్టాఫీస్ అధిక నెలసరి ఆదాయం**

**బ్యాంక్ ఎఫ్‌డీతో పోలిస్తే నెలకు రూ.675, ఏడాదికి రూ.8,100 అదనపు రాబడి**

**పోస్టాఫీస్ పథకంలో ప్రస్తుతం 7.4 శాతం వడ్డీ, ఐదేళ్ల కాలపరిమితి**

**బ్యాంకులను బట్టి ఎఫ్‌డీ వడ్డీ రేట్లలో మార్పులు.. సీనియర్ సిటిజన్లకు కొన్నిచోట్ల అధిక ప్రయోజనం**




స్థిరమైన, సురక్షితమైన నెలసరి ఆదాయాన్ని ఆశించే పెట్టుబడిదారులకు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ ప్రస్తుతం అత్యుత్తమ ఎంపికగా నిలుస్తోంది. ప్రముఖ బ్యాంకులు అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే, ఈ పథకంలో మదుపు చేయడం ద్వారా అధిక రాబడిని పొందవచ్చని తాజా విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి.రూ. 9 లక్షల పెట్టుబడిపై పోస్టాఫీస్ ద్వారా నెలకు రూ. 5,550 ఆదాయం వస్తుండగా, అదే మొత్తంపై ఒక సాధారణ బ్యాంక్ ఖీణ ద్వారా సుమారు రూ. 4,875 మాత్రమే లభిస్తోంది.ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో, అనేకమంది తమ పెట్టుబడులను స్థిరమైన రాబడినిచ్చే పథకాల వైపు మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో పోస్టాఫీస్ వీఖా, బ్యాంక్ ఖీణల మధ్య తులనాత్మక పరిశీలన ప్రాధాన్యత సంతరించుకుంది. అక్టోబర్-డిసెంబర్ 2026 త్రైమాసికానికి గాను పోస్టాఫీస్ వడ్డీ రేటును ప్రభుత్వం 7.4 శాతంగా కొనసాగిస్తోంది. ఈ పథకం కింద రూ. 9 లక్షలు డిపాజిట్ చేస్తే, ఏడాదికి రూ. 66,600 వడ్డీ లభిస్తుంది. దీనిని నెలవారీ ప్రాతిపదికన చెల్లిస్తారు కాబట్టి, ఖాతాదారుడికి ప్రతినెలా రూ. 5,550 ఆదాయం అందుతుంది.మరోవైపు, ఒక సాధారణ బ్యాంకులో 6.5 శాతం వడ్డీ రేటుతో రూ. 9 లక్షలు ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తే, ఏడాదికి రూ. 58,500 వడ్డీ మాత్రమే వస్తుంది. అంటే నెలకు సుమారు రూ. 4,875 మాత్రమే లభిస్తుంది. ఈ లెక్కన, బ్యాంక్ ఖీణతో పోలిస్తే పోస్టాఫీస్ వీఖా ద్వారా నెలకు రూ. 675, ఏడాదికి రూ. 8,100 అదనపు ఆదాయం పొందే వీలుంది. అయితే, ఈ రెండు పథకాల ద్వారా వచ్చే వడ్డీ ఆదాయంపై పెట్టుబడిదారుడి ఆదాయపు పన్ను స్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుందని గమనించాలి.పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ కాలపరిమితి ఐదేళ్లు. వ్యక్తిగత ఖాతాలో గరిష్ఠంగా రూ. 9 లక్షల వరకు, ఉమ్మడి ఖాతాలో రూ. 15 లక్షల వరకు డిపాజిట్ చేసే వెసులుబాటు ఉంది. ఏడాది గడిచిన తర్వాత అవసరమైతే డిపాజిట్‌ను వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. అయితే, మూడేళ్లలోపు ఖాతాను మూసివేస్తే అసలు మొత్తంలో 2%, ఆ తర్వాత మెచ్యూరిటీ వరకు 1% పెనాల్టీ విధిస్తారు.బ్యాంక్ ఖీణల విషయానికి వస్తే, వడ్డీ రేట్లు బ్యాంకు, కాలపరిమితి, డిపాజిటర్ కేటగిరీని బట్టి మారుతుంటాయి. సీనియర్ సిటిజన్లకు, కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో 8% కంటే ఎక్కువ వడ్డీ రేట్లు కూడా లభిస్తున్నాయి. అంతేకాకుండా, ఖీణలలో కాలపరిమితిని, వడ్డీ చెల్లింపుల విధానాన్ని ఎంచుకునే సౌలభ్యం పెట్టుబడిదారులకు ఎక్కువగా ఉంటుంది.ప్రభుత్వ హామీతో ఐదేళ్ల పాటు స్థిరమైన నెలసరి ఆదాయాన్ని కోరుకునే వారికి పోస్టాఫీస్ వీఖా ఒక ఉత్తమ ఎంపిక. అయితే, కాలపరిమితిలో వెసులుబాటు కావాలనుకునే వారు లేదా సీనియర్ సిటిజన్ల వంటి ప్రత్యేక కేటగిరీల కింద అధిక వడ్డీ రేట్లు పొందాలనుకునే వారు బ్యాంక్ ఖీణలను పరిశీలించవచ్చు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ప్రస్తుత వడ్డీ రేట్లను పోల్చి చూసుకొని, తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం శ్రేయస్కరం.

## ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభం

**అయినా భారత వృద్ధిరేటును ఎందుకు పెంచారు? ఐఎంఎఫ్ సమాధానమిదే..!**

**భారత్ వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికి పెంచిన ఐఎంఎఫ్**

**తొలి త్రైమాసికంలో అంచనాలకు మించి వృద్ధి సాధించిందన్న ఐఎంఎఫ్ డైరెక్టర్ కృష్ణ శ్రీనివాసన్**

**బలమైన ఆర్థిక పునాదులు భారత్‌కు కలిసొచ్చాయని వ్యాఖ్య**

**ఇంధన సంక్షోభంతోనే రూపాయిపై ఒత్తిడని వివరణ**

**మారకపు విలువ ఒక్కటే ఆర్థిక విజయానికి కొలమానం కాదన్న ఐఎంఎఫ్**



అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ భారత్ ఆ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రశంసించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు, ఆర్థిక క్రమశిక్షణ, భారీ విదేశీ మారక నిల్వలు ఉండటం ఇందుకు దోహదపడ్డాయని ఐఎంఎఫ్ ఆసియా, పసిఫిక్ విభాగం డైరెక్టర్ కృష్ణ శ్రీనివాసన్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే భారత వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 7 శాతానికి పెంచినట్లు వెల్లడించారు.ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, సరఫరాపై ప్రభావం పడుతున్నప్పటికీ భారత్ వృద్ధి అంచనాను ఎందుకు పెంచారని బ్యాంకాక్‌లో గురువారం జరిగిన ఐఎంఎఫ్ వార్షిక సమావేశంలో ఆయనను ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి వృద్ధి సాధించిందని శ్రీనివాసన్ వివరించారు. సంక్షోభం ఎదురైన సమయంలో భారత్ ఆర్థిక పరిస్థితి బలంగా ఉండటం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, తగినంత విదేశీ మారక నిల్వలు కలిగి ఉండటం ప్రయోజనం చేకూర్చాయని పేర్కొన్నారు.మరోవైపు, దేశ వృద్ధి అంచనాలు పెరుగుతున్నప్పటికీ రూపాయి విలువపై ఒత్తిడి, పెట్టుబడుల ప్రవాహం తగ్గడం, చమురు ధరల పెరుగుదలపై ఆందోళనలు ఎందుకు ఉన్నాయన్న ప్రశ్నకు ఆయన స్పందించారు. మారకపు విలువపై ప్రపంచ వడ్డీ రేట్లు, పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, చమురు ధరలు ప్రభావం చూపుతాయని చెప్పారు. భారత్ చమురు దిగుమతులపై ఆధారపడే దేశం కావడంతో అంతర్జాతీయ ఇంధన సంక్షోభం ప్రభావం పడిందని వివరించారు.రూపాయి మారకపు విలువను దేశ ఆర్థిక విజయానికి లేదా వైఫల్యానికి కొలమానంగా చూడకూడదని శ్రీనివాసన్ సూచించారు. బాహ్య ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు మారకపు విలువలో మార్పులు ఒక రక్షణ కవచంలా పనిచేయడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు.దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) లెక్కింపు విధానంలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ చేపట్టిన మార్పులను ఆయన స్వాగతించారు. జీడీపీ గణాంకాల ప్రామాణికతను మెరుగుపరిచేందుకు బేస్ ఇయర్‌ను మార్చడం, ఉత్పత్తి రంగం లెక్కల్లో ఉత్పత్తిదారుల ధరల సూచీ (పీపీఐ), పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లను ఉపయోగించడం మంచి పరిణామాలని పేర్కొన్నారు. ఈ మార్పులు అంతర్జాతీయంగా అనుసరించే ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు.

తొలివార్త





# వాళ్లు క్లిక్ అయ్యారు.. మరి ఏ జూడ్ ఏం చేస్తాడో?

తెలుగులో బోలెడంత మంది యూట్యూబర్లు ఉన్నారు. రోజువారీ దైనందిన విషయాల గురించి ప్రతిరోజూ వీడియోలు చేస్తూ 'ఏ జూడ్' అనే ఛానెల్‌తో అజయ్ అనే యూట్యూబర్ గుర్తింపు తెచ్చుకున్నాడు. గత రెండు వారాలుగా ఎలాంటి వీడియోలు గానీ పోస్టులు గానీ పెట్టని ఇతడు.. సడన్‌గా హీరో అయిపోయాడు. శనివారమే ఇతడి మూవీ లాంచ్ అయింది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. రాము కొప్పుల దర్శకత్వంలో నెక్సస్ శ్రీధర్, దీపక్ ముస్త్యాల నిర్మిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతమందిస్తున్నాడు. యూట్యూబ్ కమ్యూనిటీ నుంచి వచ్చి హీరో అయినవాళ్లలో ఏ జూడ్ మొదటివాడేం కాదు. లిటిల్ హార్ట్ ఫేమ్ మౌళి, సుహాస్, సుమంత్ ప్రభాస్ తదితరులు.. యూట్యూబ్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చి నిలదొక్కుకున్నవాళ్లే. మరి వీళ్లలా అజయ్ అలియాస్ ఏ జూడ్ సక్సెస్ అవుతాడా లేదా అనేది చూడాలి?

# 'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల.. జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!



నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్' సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'అప్పుడే పెళ్లా' లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. "ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

# పల్లెటూరి నుంచి అంతరిక్షం వరకు.. దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్!




యువ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్/డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' పవన్ సాధినేని దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. చదువంటే ఇష్టమున్న ఒక అమ్మాయి పల్లెటూరి నేల నుంచి మొదలై ఏకంగా అంతరిక్షం వరకు సాగే ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రయాణంగా ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక నటిస్తుండగా, శృతి హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన విజువల్స్ తో రూపొందుతున్న ఈ టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

# షూటింగ్ పూర్తి చేసుకున్న పూరి- విజయ్ సేతుపతి 'స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్'!



క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' ఈ సినిమా షూటింగ్ తాజాగా కంప్లీట్ అయింది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ప్రేక్షకులను భావోద్వేగాల సుడిగుండంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉండబోతోందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. విజయ్ సేతుపతి -- పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై సినిమా వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# కీర్తి సురేశ్ బర్త్‌డే స్పెషల్.. 'అక్క' యాక్షన్ ప్యాక్డ్ టీజర్ విడుదల!

టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా వరుస అప్‌డేట్లు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే వెంకీ సినిమా నుంచి క్రేజీ అప్‌డేట్ రాగా, తాజాగా ఆమె నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'అక్క' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా వస్తున్న ఈ సినిమా టీజర్ పూర్తిగా యాక్షన్ ప్యాక్డ్‌గా, ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్‌తో పాటు మరో టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఇద్దరు పవర్‌ఫుల్ నటీమణుల కలయికలో వస్తున్న ఈ థ్రిల్లర్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సరికొత్త లుక్‌లో, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో కీర్తి సురేశ్ కనిపించనున్న ఈ టీజర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040